మంచిమాట



మనిషి ఎప్పుడు ఖాళీగా ఉండకూడదు.. ఉంటే పనికిరాని ఆలోచనలు వచ్చి అజ్ఞానిగా మారిపోతారు.

స్వామి వివేకానంద

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్) & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక 15 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | జూలై 14, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## బనకచర్లపై నోటీసులు ఇవ్వడం
# కుదరదు

- తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం స్పష్టీకరణ

- పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని వెల్లడి



**న్యూఢిల్లీ,జూలై 13 :** పోలవరం, గోదావరి నీటి వినియోగం, బనకచర్ల అనుసంధానం అంశాలపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ వేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వాలని, ఇంజక్షన్ ఉత్తర్వులు మిగతా2లో...

## పవన్ కళ్యాణ్‌కు సిఎం ఫడ్నవీస్ పరామర్శ



**ముంబై,జూలై 13 :** తన భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. సందర్భంగా పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని ఫడణవీస్ అడిగి తెలుసుకున్నారు. ఆయన మిగతా2లో...




## ఎల్-నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు
# ప్రభుత్వం సన్నద్ధం

- మూడు దశల ముందస్తు కార్యాచరణ
- ఇక్రిశాట్‌లో శాస్త్రవేత్తలతో మంత్రి తుమ్మల ఉన్నతస్థాయి సమీక్ష
- కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండాలి
- వాతావరణ, భూగర్భజలాలు, నీటిలభ్యత పరిస్థితులపై బులెటిన్ విడుదల
- 'రైతు నేస్తం' కార్యక్రమంలో ఎల్-నినోపై రైతులకు ప్రత్యేక అవగాహన
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్,జూలై 13 :** ఎల్-నినో ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇక్రిశాట్ లో భారత వాతావరణ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, మిగతా2లో...

## కేంద్ర సహకారంతోనే
# అభివృద్ధి సాధ్యం

- పార్లమెంటులో వివిధ సమస్యలపై ప్రస్తావించాలి
- మెట్రో, ట్రిపుల్ ఆర్ తదితర అంశాలపై అనుమతులు రాబట్టాలి
- ఎంపీలతో ప్రజాభవన్‌లో సిఎం రేవంత్ భేటీ
- ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు
- సమావేశంలో సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీలు హాజరు



**హైదరాబాద్,జూలై 13 :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించగలం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. హైదరాబాద్ కు ఎఐఓ ను తీసుకురావాలి. ఇందుకు బీజేపీ ఎంపీలు చొరవ చూపాలన్నారు. మెట్రో విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. మెట్రో విస్తరణకు సంబంధించి రుణాల పక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చూడాలని అన్నారు. మిగతా2లో...

## షాబాద్ నరహంతకుడు
# మృతి

- పురుగుల మందు తాగి ఆత్మహత్య
- సూసైడ్‌కు ముందు సెల్ఫీ వీడియో
- కొత్తూరు మండలంలో ఘటన
- వివరాలు వెల్లడించిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి


2లో

## సాధ్యమైనంత మేర గోదావరి
# జలాల వినియోగం

- మేడిగడ్డ వద్ద గేట్లు మూసివేస్తే బ్యారేజ్‌కు ప్రమాదం
- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక మేరకు నడుచుకుంటున్నాం
- సమ్మక్క ప్రాజెక్టును సందర్శించిన మంత్రులు


2లో

## జాడలేని వర్షాలు...
## ముఖం చాటేసిన మబ్బులు

- మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు


2లో



## సుప్రీం సాక్షిగా బయటపడ్డ
# రేవంత్ వైఫల్యం

- బనకచర్లపై పిటిషన్ అంతా తప్పులతడక
- గురువు చంద్రబాబు కోసమే డ్రామాలు
- మరోమారు మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు

**సంగారెడ్డి,జూలై 13 :** రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు సుప్రీంకోర్టు సాక్షిగా బయటపడ్డాయని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మొదటి నుంచి రాజకీయ కాంక్ష తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని ధ్వజమెత్తారు. తన రాజకీయ గురువు చంద్రబాబుకి మిగతా2లో...

## సింగరేణిని భ్రష్టు పట్టించిన
# బిఆర్ఎస్, కాంగ్రెస్


- గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారు
- అప్పుడు బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోంది
- సింగరేణి భరోసా యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి




**భద్రాద్రి కొత్తగూడెం,జూలై 13 :** సింగరేణిలో ప్రస్తుత పరిస్థితికి కారణం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారని ఆరోపించారు. సింగరేణిని అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అక్రమంగా కేటాయించిన మైన్స్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసిందని.. బొగ్గు గనులను పారదర్శకంగా కేటాయించాలని మిగతా2లో...

## సిఎం రేవంత్
# దిగజారుడు భాష

- బూతుపురాణాలు సరికాదు
- ఎంపి ఈటెల రాజేందర్ హితవు



**హైదరాబాద్,జూలై 13 :** రాష్ట్ర చరిత్రలో అత్యంత దిగజారుడు భాష మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి ఒక్కడేనని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. గత కొద్ది రోజులుగా ప్రతిపక్షాలను అందునా బీఆర్ఎస్ లక్ష్యంగా బూతు పురాణం అందుకుంటున్న మిగతా2లో...

# సాధ్యమైనంత మేర గోదావరి జలాల వినియోగం

**ములుగు,జూలై 13 :** రాష్ట్ర ప్రభుత్వం గోదావరి జలాలను సాధ్యమైనంత మేర వినియోగించు కోవాలని నిర్ణయించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సమక్క బ్యారేజ్‌లో గేట్లు మూసివేయడం వల్ల 71 మీటర్ల ఎత్తులో నీటి నిల్వలు ఉన్నాయని, అందువల్ల దేవాదుల ప్రాజెక్టు ద్వారా 7 మోటార్లతో నీటిని ఎత్తిపోస్తున్నామని చెప్పారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమక్క సాగర్ ప్రాజెక్టును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. హెలికాప్టర్‌లో అక్కడికి చేరుకున్న మంత్రులకు జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ లెనిన్ వస్సల్ టోప్పో ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత సమక్క బ్యారేజ్, దేవాదుల ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రులు గోదావరి జలాల వినియోగం, కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ పరిస్థితిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కన్నెపల్లి పంప్‌హౌస్ ఎందుకు పనిచేయడం లేదని ప్రశ్నించే వారికి వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. మేడిగడ్డ వద్ద గేట్లు మూసివేస్తే బ్యారేజ్‌కు ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరించారని, వారి సూచనలను పాటిస్తున్నామని తెలిపారు. పారే నీటినే ఎత్తుకునే అవకాశం ఉంటే మూడు బ్యారేజీలు ఎందుకు నిర్మించారో మాజీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికల ఆధారంగానే ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 22 రిజర్వాయర్ల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని వెల్లడించారు. సమక్క బ్యారేజ్‌లో నీటిని నిల్వ చేస్తే పంపింగ్ సులభమవుతుందని చెప్పారు.

మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం నుంచి ప్రవహించే నీటిని పంపింగ్ చేసే అవకాశం ఉన్నప్పుడు భారీ బ్యారేజీల నిర్మాణం ఎందుకు చేపట్టారో మాజీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, ఇంజినీర్ల సూచనల మేరకే ప్రభుత్వం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. గతంలో నిర్మించిన అనేక డ్యామ్‌లు సురక్షితంగా ఉండగా.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన బ్యారేజీలు మాత్రం నాణ్యత సమస్యలతో నిలిచిపోయాయని ఆరోపించారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా సాగు, తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. కాళేశ్వరం నీటిని ఉపయోగించకుండానే గత ఏడాది 84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని చెప్పారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో నాణ్యత లోపాలు ఉన్నాయని నిపుణుల కమిటీ ఇప్పటికే నివేదించిందని తెలిపారు. మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయొద్దని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ గత ప్రభుత్వ హయాంలోనే సూచించిందని గుర్తుచేశారు. డిజైన్ మార్పులు, నాణ్యతా లోపాల కారణంగానే ప్రస్తుతం ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. మేడిగడ్డపై ఐఐటీ బాంబే నిపుణులతో పాటు సైన్యం సహకారంతో సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తున్నామని.. మరమ్మతులకు అవసరమైన నివేదికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. దేవాదుల ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇచ్చి పనులు పూర్తి చేస్తున్నామని, ప్రస్తుతం 7 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నామని చెప్పారు.

# ఎల్-నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సన్నద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌సీడ్స్ రీసెర్చ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మి÷-లలెట్స్ రీసెర్చ్, సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధరంగ ఉన్నతాధికారులతో మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలను సమగ్రంగా పరిశీలించి, శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలకు అనుగుణంగా తుది కార్యాచరణపై మంత్రి చర్చించారు. ముందుగా వివిధ ఇన్స్టిట్యూషన్స్ నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు ఎల్-నినో పరిస్థితులను తట్టుకునే విధంగా వారు వారు సిద్ధం చేసిన కార్యచరణను మంత్రికి తెలియచేశారు. ముఖ్యంగా కరువు పరిస్థితు లను ఎదుర్కొనేందుకు వీలుగా తట్టుకొనే పంటలు మరియు రకాలు, ఇప్పటికే సాగు చేసిన పంటలలో తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సమర్పించారు. మంత్రి మాట్లాడుతూ, శాస్త్రవేత్తలు సూచించిన ప్రతి యాజమాన్య చర్యను క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేసి, జిల్లాల్లో అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అనుబంధ రంగ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. తరువాత మాట్లాడిన వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎల్-నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమవడం వంటి అవకాశాల ను దృష్టిలో పెట్టుకుని జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపది కగా తీసుకుని మూడు దశల్లో రాష్ట్రవ్యాప్త కంటింజెన్సీ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా జిల్లా వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసినట్లు చెప్పారు. జూలై 15 వరకు వర్షాలు ఆలస్యమైతే 16.30 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, జూలై 30 వరకు ఆలస్యమైతే 13.82 లక్షల క్వింటాళ్లు, ఆగ స్టు 15 వరకు వర్షాభావ పరిస్థితులు కొనసాగితే 12.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవు తాయని అంచనా వేసి ముందుగానే అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# షాబాద్ నరహంతకుడు మృతి

**కొత్తూరు,జూలై 13 :** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో అతి కిరాతకంగా ఆరుగురిని హత్య చేసిన హంతక ఉన్మాది రాజ్ కుమార్ కథ విషాదంగా ముగిసింది. కొత్తూరు మండలం పెంజర్ల గ్రామ పరిధిలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో సైతం తీసుకున్నాడు. కొత్తూరు మండలంలోని పెన్జర్ల రెవెన్యూ పరిధిలోని ఓ వెంచర్ సమీపంలోని వ్యవసాయ పొలంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు సిబ్బంది రాజ్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించేందుకు మృతుని సోదరుడు, పెంజర్ల గ్రామంలో నివాసముండే మేనమామలను పిలిపించారు. వారు రాజ్ కుమార్ (29) మృతదేహాన్ని గుర్తించారు. మృతుని పక్కన పురుగుల మందు డబ్బా పడి ఉంది. ఘటనా స్థలాన్ని ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిందితుడు రాజ్‌కుమార్.. షాబాద్‌లో ఓ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తూ ఉండేవాడు. దాంతో మే నెలలో ఇతనిపై బాలిక బంధువులు ఫిర్యాదు చేయడంతో షాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కింద కేసు నమోదు చేశారు. పోక్సో కేసు పెట్టారన్న కోపం పెంచుకున్న నిందితుడు.. శుక్రవారంఅర్ధరాత్రి బాలిక ఇంటికి వెళ్లి.. ఆమె తల్లి, అమ్మమ్మను కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతరం బాలికను తీసుకొని దైవాలగూడానికి చేరుకొని, అతని సొంత ఇంట్లో భార్య, ఇద్దరు కుమారులను కూడా కత్తితో పొడిచి చంపాడు. తిరిగి అక్కడ నుండి బాలికను తీసుకొని సుమారు 200 మీటర్ల దూరంలో బాలికను కూడా హత్య చేసి పరారయ్యాడు. అనంతరం అతని తండ్రికి ఫోన్ చేసి.. 'నేను ఆరుగురిని హత్య చేశాను.. నేను కూడా ఆత్మహత్య చేసుకుంటున్న' అని చెప్పాడు. అయితే ఆరుగురి హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. పోలీసులు 12 బృందాలుగా ఏర్పడి నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం కొత్తూరు మండలం పెంచర్ల రెవెన్యూ పరిధిలోని ఓ వెంచర్‌లో మృతదేహం కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. ఆ మృతదేహం రాజ్ కుమార్‌దిగా గుర్తించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితునికి ఆన్‌లైన్ బెట్టింగ్ కూడా అలవాటు ఉంది. ఆన్‌లైన్ బెట్టింగ్ పెట్టి సుమారు రూ.2కోట్లు అప్పు చేశాడు. దాంతోపాటు అతడు 16 సిమ్ కార్డులను తీసుకొని నెంబర్లు మారుస్తూ వాడుతున్నాడు. **వాడిని అంత ప్రశాంతంగా చనిపోనియాల్సింది కాదు..: మృతుని సోదరుడు భాస్కర్** అభం శుభం తెలియని పసిపిల్లలతోపాటు మరో ముగ్గురి ప్రాణాలు తీసిన రాజ్‌కుమార్ అంత ప్రశాంతంగా చనిపోవాల్సింది కాదని, వాడిని ఎన్‌కౌంటర్ చేసి చంపాల్సిందని మృతుని సోదరుడు భాస్కర్ అన్నారు. వాడి వల్ల ఎన్నో కుటుంబాలు నాశనం అయ్యాయని ఏడుస్తూ పోలీసుల ముందు మొరపెట్టుకున్నాడు.

# సుప్రీం సాక్షిగా బయటపడ్డ రేవంత్ వైఫల్యం

(మొదటి పేజీ తరువాయి)

గురుప్రదక్షిణ చెల్లించుకునేందుకే సీఎం రేవంత్ ఆరాటపడుతున్నారని విమర్శించారు. గోదావరి, నల్లమల కేసులో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి మొట్టికాయలు వేసిందని, కావాలనే లోపాలతో కూడిన కేసును వేయడం వల్లే ఈ కేసు నిలువదని ఉన్నత న్యాయమూర్తులు చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో చేస్తున్నట్లు చూపించుకోవడానికి కేవలం బ్యాక్ డేట్ ఉత్తరాలు రాసిందని ఎద్దేవా చేశారు. గోదావరి బనకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని మొదటి నుంచి బీఆర్ఎస్ మొత్తుకుంటూనే ఉందని హరీష్ రావు తెలిపారు. చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కు అయ్యారని చెప్పడానికి ఇంకేం ఆధారాలు కావాలి? 'నువ్వు కొట్టినట్టు చెయ్.. నేను తిట్టినట్టు చేస్తా' అన్నట్లుగా రేవంత్ డ్రామాలు ఆడుతున్నారు. రేవంత్ కేవలం ఉద్యమ ద్రోహినే కాదు, తెలంగాణకు జలద్రోహిగా కూడా మారిపోయారు' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బనకచర్లపై సమావేశానికి వెళ్లనని చెప్పిన రేవంత్, ఆ తర్వాత దొంగచాటుగా వెళ్లారని ఆరోపించారు. పైగా చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తుడైన, తెలంగాణ ద్రోహి అయిన ఆదిత్యనాథ్ దాస్‌ను కమిటీలో ఎలా నియమిస్తారని నిలదీశారు. రేవంత్ రెడ్డికి జల వనరులపై అవగాహన తక్కువ, ఆవేశం ఎక్కువ అని హరీష్ రావు ఎద్దేవా చేశారు. గోదావరి నల్లమల సాగర్‌పై ఆంధ్రప్రదేశ్ టెండర్లను 11 డిసెంబర్ 2025 నాడే పూర్తి చేసిందని, దానిపై కాంగ్రెస్ ప్రభుత్వం 16 డిసెంబర్ 2025న రిట్ పిటిషన్ వేసిందని హరీష్ రావు గుర్తుచేశారు. అది డిస్మిస్ అయిన తర్వాత గత 7 నెలలుగా ఈ ప్రభుత్వం ఏం చేస్తూ తమాషాలు చేస్తోందని ప్రశ్నించారు. నిన్న మొన్నటి వరకు రివ్యూలు చేయాల్సిన పాలకులు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకో వడానికి బీఆర్ఎస్‌పై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటకలో ముగ్గురు సీఎంల అజెండా ఏంటో రేవంత్ రెడ్డి బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 'ఎన్ఓసీ' పేరిట తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ ఏపీకి అమ్ము కుంటున్నారని, దీనిపై అసెంబ్లీని సమావేశపరిచి చర్చ జరపాలని, దొంగచా టుగా వ్యవహారాలు నడిపితే తాము ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బనకచర్ల విషయంలో రేవంత్ తీరు అనుమానాస్పదంగా ఉందని, అందుకే ఇవాళ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ సమావేశానికి వెళ్లలేదని పేర్కొన్నారు.

# జాడలేని వర్షాలు... ముఖం చాటేసిన మబ్బులు

## - మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు




**హైదరాబాద్,జూలై 13 :** తెలంగాణలో జులై నెలలోనూ ఎండలు తీవ్రత మళ్లీ మెల్లగా పెరుగుతోంది. వర్షాలు ముఖం చాటేయంతో ఎండలు కొనసాగుతున్నాయి. సాధారణంగా ఈ కాలంలో వర్షాలు కురవాల్సి ఉండగా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. జులై రెండో వారంలోనూ సాధారణం కంటే సుమారు 3.5 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పగటి వేళల్లో ఎండ తీవ్రత పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, వచ్చే రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, అనారోగ్య సమస్యలున్న వారు అవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లకుండా ఉండటం మంచిదని సూచిస్తున్నారు. అలాగే తగినంత నీరు తాగడం, తేలికపాటి దుస్తులు ధరించడం, ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# బనకచర్లపై నోటీసులు ఇవ్వడం కుదరదు

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాలని పిటిషన్‌లో కోరింది. తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రధాన పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. లోపాలు సరిదిద్దే వరకు విచారణ చేపట్టడం కుదరదని స్పష్టం చేసింది. 15 మంది ప్రతివాదులు ఉన్నారని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. లోపాలు సరిదిద్దాక విచారణలో మిగతా అంశాలు పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది. పిటిషన్‌పై విచారణ జరపకుండా నోటీసులివ్వలేమని తెలిపింది. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు నిరాకరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా, ఈ పిటిషన్ నిబంధనలకు విరుద్ధంగా లిస్ట్ అయ్యిందంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒరిజినల్ సూట్ విషయంలో నిబంధనల ప్రకారమే విచారణకు రావాలని స్పష్టం చేసింది. రిజిస్ట్రీ రూల్స్ ప్రకారం ఇటువంటి ఒరిజినల్ సూట్ పిటిషన్‌ను ముందుగా చాంబర్ జడ్జి ముందు దాఖలు చేయాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆ పక్రియ పూర్తికాకముందే ప్రతివాదులకు నోటీసులు ఇవ్వకుండా నేరుగా బెంచ్ ముందుకు విచారణకు రావడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. అయితే, అప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదననూ సుప్రీంకోర్టు పట్టించుకోలేదు.

# సింగరేణిని భ్రష్టు పట్టించిన బిఆర్ఎస్, కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేసిందని తెలిపారు. సింగరేణిలో కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. సింగరేణికి నైనీ కోల్ బ్లాక్ కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీకి కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సింగరేణి భరోసా యాత్ర కార్యక్రమానికి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇప్పటివరకు వేలం ద్వారానే బొగ్గు గనులు కేటాయిస్తూ వచ్చామని అన్నారు. మోదీ ప్రభుత్వం వేలం లేకుండా ఇచ్చిన ఏకైక బ్లాక్.. తాడిచర్ల-2 అని తెలిపారు. సింగరేణికి అండగా ఉండాలనే ప్రధాని మోదీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సింగరేణిలో బొగ్గు మాయమైందని కేటీఆర్, హరీశ్ లేఖలు రాసినట్లు చెప్పారు. 'సింగరేణి అంశంలో కేంద్రం తలదూర్చదని మీకు తెలియదా? మెస్సీతో ఫుట్‌బాల్ ఆడేందుకు సింగరేణి డబ్బు ఖర్చు చేస్తారా? సింగరేణిని అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేశారు' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్ల పాటు సింగరేణిని కేసీఆర్ ఓటు బ్యాంకుగా చూశారని వ్యాఖ్యానించారు. సింగరేణికి చేసిన మేలు ఏమిటో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌పై మాత్రం కేసీఆర్ మాట్లాడలేదన్నారు. సింగరేణిలో ఏం జరిగినా కేంద్రాన్ని సంప్రదించడం లేదన్నారు. సింగరేణిపై కేంద్రం పెత్తనం ఉండదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రస్తావిస్తూ, గత ప్రభుత్వాల విధానాలపై మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వ కాలంలో దేశంలో అతిపెద్ద బొగ్గు కుంభకోణం జరిగిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆ సమయంలో జరిగిన బొగ్గు గనుల కేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని, అనంతరం బొగ్గు బ్లాకుల కేటాయింపులు పారదర్శకంగా జరగాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వేలం పక్రియ లేకుండానే సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ను కేటాయించిందని తెలిపారు. ఈ బ్లాక్‌లో గ్రేడ్-8 నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, మరో 40 నుంచి 50 సంవత్సరాల వరకు సింగరేణి అవసరాలను తీర్చగల సామర్థ్యం ఉందని చెప్పారు. సింగరేణి సమస్యలను తాను పలుమార్లు ప్రధాని దృష్టికి తీసుకెళ్లానని, సంస్థకు మరిన్ని బొగ్గు బ్లాకులు అవసరమని కేంద్ర ప్రభుత్వానికి వివరించానని కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుతం సింగరేణి ఎదుర్కొంటున్న పరిస్థితులకు బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు.

# కేంద్ర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణ ఒక కొలిక్కి వచ్చింది.. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని దాన్ని పూర్తి చేసుకోవాల్సి ఉందన్నారు. మూసీ పునరుజ్జీవానికి సంబంధి ంచి కేంద్రం నుంచి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కోసం అనుమతులు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. సాగునీటికి సంబంధించి తుంగభద్ర గేట్స్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఆర్ పాటిల్ తో చర్చించాం. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఇవ్వాల్సి ఉంది. డిండి-30 టీఎంసీలకు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు-90 టీఎంసీలకు ఔక్షఅ ఇవ్వాల్సి ఉంది.

120 టీఎంసీలకు కేంద్రం అనుమతులు వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసుకోవచ్చు. గోదావరి, కావేరి నదుల అనుసం ధానంతో రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుంది. కేంద్రం సహకరిస్తే కేంద్రం సహకరించిందని మేం నిరభ్యంతరంగా చెబుతాం. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఒప్పుకునేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవని అన్నారు. తుమ్మిడిహట్టి, పోర్ట్ కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్ పోర్ట్స్ కు సంబంధించిన అనుమతులు వీలైనంత త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. ఎంపిలతో భేటీలో రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపిలతో పాటు బిజెపి ఎంపిలు ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్ దిగజారుడు భాష

(మొదటి పేజీ తరువాయి)

సీఎం తీరుపై ఆయన స్పందించారు. కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద నీళ్లు 94 మీటర్లు లేకున్నా కేవలం రూ.2 కోట్లతో కాఫర్ డ్యామ్ నిర్మించి నీళ్లు లిఫ్ట్ చేయొచ్చు. అది వదిలేసి సలహాలు ఇస్తున్న ఇంజినీర్లను తిట్టడం, బీఆర్ఎస్ నాయకుల రక్తం చిందిస్తా అనడం మూర్ఖత్వమన్నారు. రేవంత్ రెడ్డి నాకు ఎన్‌డీఎస్ఏ చెప్తేనే ప్రాజెక్టుల్లో నీళ్లు నింపుతా అని అజ్ఞానంతో మాట్లాడుతున్నాడు.

అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పిల్లర్లు ఎక్కడా కుంగిపోలేదని, ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్ ప్రకారం అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు గ్రౌటింగ్ కూడా చేశారన్నారు. ఎల్ నినో ప్రభావం ఉన్నందున అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నీళ్ళు నింపుతామని రేవంత్ రెడ్డి ఎన్‌డీఎస్ఏ దగ్గరికి వెళ్ళి అడిగాడా? అని నిలదీశారు. ఇప్పటికైనా భేషజాలకు పోకుండా కాళేశ్వరం జలాలతో ప్రాజెక్టులను నింపి రైతులను ఆదుకోవాలని హితవు పలికారు.

# పవన్ కళ్యాణ్‌కు సిఎం ఫడ్నవీస్ పరామర్శ

(మొదటి పేజీ తరువాయి)

త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యులు అందిస్తున్న చికిత్స, ఆరోగ్య పరిస్థితిపై కూడా వివరాలు ఆరా తీశారు. తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఆస్పత్రికి వచ్చి పరామర్శించినందుకు దేవేంద్ర ఫడణవీస్‌కు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీ సందర్భంగా ఇద్దరు నాయకులు కాసేపు ఆత్మీయంగా పలుకరించుకున్నట్లు తెలుస్తోంది. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడంతో అభిమానులు, జనసేన కార్యకర్తలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

## రాజరాజేశ్వర ఆలయంలో భక్తుల సందడి



**ఖానాపూర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని దిల్వాపూర్ రాజరాజేశ్వరి స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. 250 ఏళ్లకు ఒక సారి వచ్చే మాస శివరాత్రి--ఆరుద్ర నక్షత్రం కలయిక సందర్భంగా భక్తులు తండూ పతం డాలుగా తరలివచ్చారు. అనేక మంది భక్తులు పంచామృతంతో శివలింగానికి అభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సర్పంచ్ చింతల మల్లేష్, ఉప సర్పంచ్ ఓరాగంటి రాజేశ్వర్ కూడా పాల్గొన్నారు. అలాగే ఖానాపూర్ పట్టణంలోని శ్రీరామ్ నగర్ మహాలక్ష్మి అన్నపూర్ణ ఆలయం, మస్కాపూర్ శివాలయం, రంగంపేట శివాలయం, గంగాయిపేట్ శివాలయాల్లో కూడా భక్తులు అధిక సంఖ్యలో అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన మేయర్



**కరీంనగర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా 10వ డివిజన్ కోతి రాంపూర్ గిద్దె పెరుమండ్ల గుడి సమీపంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, నాణ్యమైన రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్య సేవలు అందించే దిశగా పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, స్థానిక కార్పొరేటర్ సౌగాని కొమురయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ 50శాతం పూర్తి



**ఖానాపూర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎన్నికల సంఘం ఇచ్చిన ఎస్ఐఆర్ ఫారాల నమోదు ప్రక్రియ ఖానాపూర్ మండలంలో 50 శాతం పూర్తయిందని ప్రత్యేక ఇన్‌చార్జి, మండల రెవెన్యూ సర్వేయర్ కిషన్ తెలిపారు. మండలంలోని 25 గ్రామపంచాయతీలలో బీఎల్ఓలు, బీఎల్ఏల ఆధ్వర్యంలో ముమ్మరంగా నమోదు కొనసాగుతోందని, పార్టీలు స్వయంగా సహాయక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. చివరి తేదీ లోపల 100 శాతం నమోదు పూర్తి చేయడానికి అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలని ఆయన పిలు పునిచ్చారు.మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ సహాయక కేంద్రాన్ని సందర్శించి, ఓటర్ల ఫారాలను స్వీకరించారు. పట్టణంలో దాదాపు 50 శాతం నమోదు పూర్తయిందని, ఈ నెల 24లోపు ప్రతి ఓటరు నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎస్ఐ ఆర్ ఫారాలను నింపకపోతే ఓటు హక్కు కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆమె మాట్లాడుతూ ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాక ప్రజాస్వామ్యంలో గొంతు, శక్తి, భవిష్యత్తు అని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించి ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు. నా ఓటు -- నా హక్కు, నా బాధ్యత అని ద మౌనిక స్పష్టం చేశారు.

## ఎంపీ అరవింద్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా విమర్శించిన ఎమ్మెల్యే సంజయ్



**జగిత్యాల, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయం భూమిపూజ అనంతరం ఎంపీ అరవింద్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా విమర్శించారు. అభివృద్ధి కోసం సీఎం, మంత్రులు, ఎంపీలతో సమన్వయం చేస్తూ నిధులు తెస్తున్నానని, జగిత్యాల నియోజకవర్గానికి అనేక విద్యాసంస్థలు తీసుకువచ్చానని తెలిపారు.గురుకుల పాఠశాలలు, మహిళా డిగ్రీ కళాశాల, మెడికల్, నర్సింగ్ కాలేజీలు, పోలాస కళాశాల నూతన భవనం వంటి విద్యా సంస్థలు ఏర్పాటు చేశానని పేర్కొన్నారు. తన జీవితం ప్రజల్లోనే గడుస్తుందని, అక్రమ సంపాదనలు లేవని, అహంకారం లేదని స్పష్టం చేశారు.కేంద్రీయ విద్యాలయం స్థల కేటాయింపు కాంగ్రెస్ ప్రభుత్వమే చేసినదని, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు సహజ వ్యవసాయం అభివృద్ధి, రైతులకు యూరియా పంపిణీ కోసం యాప్ తీసుకువచ్చాయని వివరించారు. పనులు తక్కువ, మాటలు ఎక్కువగా మాట్లాడితే ఇక సహించేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గజంగి నందయ్య, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, బండ శంకర్, గట్టు సతీష్, అబ్దుల్ ఖాదర్, అడువల లక్ష్మణ్, బాలే శంకర్, క్యాదసు నాగయ్య, దుమల రాజ్ కుమార్, కౌన్సిలర్లు కమాల్, ప్రశాంత్ రావు, చీటి లక్ష్మీ నారాయణ, అహమ్మద్, పవన్, సలావుద్దీన్, మున్నా, దయల శరత్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు గడువులో పూర్తి చేయాలి కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు.ఐడీఓసీ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత, ఫాగింగ్, శానిటేషన్ డ్రైవ్‌ను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వనమహోత్సవం లక్ష్యాలను ప్రతి శాఖ పూర్తి చేయాలని, ప్రతి ఉద్యోగి ఒక మొక్క నాటేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో ప్రకృతి, పోషకాహారంపై అవగాహన పెంపొందించాలని సూచించారు. అర్హులైన విద్యార్థులకు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్, యూనిఫాంలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


## పాలకుర్తి ఈశాల తక్కల్లపల్లి రహదారి పనులు ప్రారంభం



**పాలకుర్తి, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎన్నో ఏళ్లుగా శిధిలావస్థలో ఉన్న పాలకుర్తి--ఈశాల తక్కల్లపల్లి రహదారి ఎట్టకేలకు డబుల్ రోడ్డు రూపంలో నిర్మాణం ప్రారంభమైంది. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ కృషితో 18 అడుగుల వెడల్పుతో నాలుగు కిలోమీటర్ల రహదారి పనులు సోమవారం మొదలయ్యాయి.ఈ రహదారి దారుణ స్థితి కారణంగా ఇప్పటి వరకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనగా, ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆలస్యమైనా పనులు ప్రారంభమవడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కుటుంబంలో అనుకోని విషాదం కారణంగా శంకుస్థాపన కార్యక్రమం వాయిదా పడినా, అభివృద్ధి పనులు ఆగకుండా కొనసాగాలని ఆదేశించడంతో కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టాడు. తమ చిరకాల కోరిక నెరవేరుతోందని పాలకుర్తి, ఈశాల తక్కల్లపల్లి గ్రా మాల ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## విలేజ్ డైరెక్టరీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

### - కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాపులేషన్ సెన్సస్--2027లో భాగంగా నిర్వహించనున్న విలేజ్ డైరెక్టరీ సర్వేను అత్యంత కచ్చితత్వంతో జరపాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్‌లో గ్రామ పాలన అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. జూలై 13 నుంచి 16 వరకు జరిగే ఈ శిక్షణలో మాస్టర్ ట్రైనర్లు వివరించే అంశాలను శ్రద్ధగా అవగాహన చేసుకోవాలని సూచించారు.ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 8 వరకు జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాలు, మున్సిపాలిటీలలో సర్వే నిర్వహించనున్నారు. తాగునీటి సౌకర్యం, విద్యుత్, ఆస్పత్రులు, డ్రైనేజీ, విద్యాసంస్థలు, పశువైద్య సేవలు వంటి తొమ్మిది విభాగాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు .సేకరించిన వివరాలను మండల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పరిశీలించి సవరణలు చేసి రాష్ట్ర సెన్సస్ అధికారుల ద్వారా ఢిల్లీకి పంపుతారు. అనంతరం డిస్ట్రిక్ట్ సెన్సస్ హ్యాండ్‌బుక్ విడుదల కానుంది.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రాందత్తా రెడ్డి, గణాంక అధికారి వెల్ది కిషన్ రావు, రాష్ట్ర సెన్సస్ విభాగానికి చెందిన అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారంకై భారీ ర్యాలీ




**కరీంనగర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం తెలంగాణ చౌక్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ జరిగింది. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, పలు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మానేరు నదిలో లభిస్తున్న ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించడం వల్ల స్థానికంగా ఇసుక కొరత ఏర్పడి నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, స్థానిక అవసరాల కోసం ఇసుక వినియోగానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. అలాగే లేబర్ కార్యాలయాన్ని కలెక్టరేట్ ప్రాంగణానికి మార్చాలని, కార్మిక సంక్షేమ సంఘానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాల అమలు సరిగా జరగడం లేదని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు కానుందని తెలిపారు. కార్మికుల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. ర్యాలీలో కార్మిక సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల విద్యార్థులకు ఫీజు రాయితీ, హెల్త్ కార్డులు ఇవ్వాలి

### - డీజేఎఫ్




**పెద్దపల్లి, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డెమోక్రటిక్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు .పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జర్నలిస్టుల పిల్లలకు విద్యా ఫీజుల్లో రాయితీ లేదా ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలని, జర్నలిస్టులు మరియు వారి కుటుంబాలకు ప్రత్యేక హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడం, గృహ స్థలాల కేటాయింపు, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.పలుమార్లు ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంతో జర్నలిస్టుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని వారు అన్నారు. ఈ సమావేశంలో డీజేఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రావు జాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు ఏనగు మల్లారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహంకాళి సంపత్, బైలా కమిటీ ఉపాధ్యక్షుడు అరికిల్ల జయకుమార్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కన్నం అవినాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్, కోశాధికారి నవీన్ కుమార్, ప్రచార కార్యదర్శి కల్లెపల్లి సతీష్, మంచిర్యాల జిల్లా కన్వీనర్ రామడుగు కొమరయ్య, పెరుక నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఏకగ్రీవంగా కోరారు.

RNI - TELTEL/2023/87644

# లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నిక



**ఖానాపూర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి.అధ్యక్షుడిగా తునికి మహేందర్, ఉపాధ్యక్షుడిగా కానుగంటి మల్లేష్, కోశాధికారిగా బూసి వెంకటరాములు, ప్రధాన కార్యదర్శిగా సంఘ రమేష్ ఎన్నికయ్యారు.తమను నమ్మి ఎన్నుకున్న గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని కొత్త పాలకవర్గం హామీ ఇచ్చింది.

# ప్రజావాణిలో అమరుల స్థూప స్థలంపై వినతిపత్రం




**హుస్నాబాద్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ అమరుల స్థూప స్థల సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ రీఫార్మ్స్ సీలింగ్ యాక్ట్ 1973 ప్రకారం సర్వే నంబర్లు 1189, 275లో అదనపు భూమి కేటాయింపులపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఈ సర్వే నంబర్లలో ఎంత భూమి సీలింగ్ కింద పేదలకు ఇచ్చారు, ఆ భూమి తిరిగి భూయజమానికి ఎలా చేరింది అనే అంశాలను పరిశీలించాలని కమిటీ విజ్ఞప్తి చేసింది. స్థూప స్థలాన్ని కబ్జాదారుల నుండి కాపాడి అమరుల స్మృతి వనం నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని కమిటీ ఆర్డీఓను కోరింది.

# విద్యుత్ వైర్లు చోరీ

**ఖానాపూర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని బాదం కుర్తి గ్రామంలో ఆరుగురు రైతుల వ్యవసాయ బావుల వద్ద ఉన్న విద్యుత్ మోటార్ల సర్వీస్ వైర్లు ఆదివారం రాత్రి దుండగులు కట్ చేసి ఎత్తుకెళ్లారు.మాసుల లక్ష్మీరాజం, మాసుల రమేష్, అంబటి నరసయ్య తదితర రైతులు సోమవారం పంటలకు నీరు పెట్టడానికి వెళ్లినప్పుడు వైర్లు మాయం అయినట్లు గుర్తించారు. దాదాపు రూ.40 వేల విలువైన నాణ్యమైన వైర్లు దొంగిలించబడటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఇది మూడోసారి వైర్లు దొంగిలించబడటం వల్ల పంటలకు నీరు పెట్టడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, విత్తనాలు, ఎరువులు కొనడానికి పెట్టుబడులు లేకపోవడంతో మరింత కష్టాల్లో పడుతున్నామని రైతులు తెలిపారు.

# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ సహాయక కేంద్రం ఏర్పాటు



**ఖానాపూర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని బాదం కుర్తి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీటీసీ శ్రావణ్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఐఆర్ సహాయక కేంద్రం ఏర్పాటు చేశారు.ఓటర్లు అధిక సంఖ్యలో హాజరై ఎస్ఐఆర్ ఫారాలను నింపి సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ లత, బీఎల్ఏ శ్రావణ్, బండి లింగన్న, తుతారి రాజేశ్వర్, గ్రామస్థులు పాల్గొన్నారు.శ్రావణ్ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగం కోసం ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా ఎస్ఐఆర్ ఫారాలను నింపాలని, ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అమూల్యమని సూచించారు.

# ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



**రామడుగు, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా రామడుగు మండలం వెంకట్రావుపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తినకూడదని, కలుషిత నీరు త్రాగరాదని సూచించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు సుగుణ, రాని, ఉపాధ్యాయులు కరుణాకర్, గీత, ఆంజనేయులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై కలెక్టర్ సమీక్ష



**సిద్దిపేట, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన 109 వినతులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. కొండపాక మండలం దుద్దెడ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, పరిశుభ్రత, కిచెన్ గార్డెన్ల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆదేశించారు.జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్, 1--19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సమీక్షించి, ప్రతి అర్హ ఓటరిని నమోదు చేస్తూ నిర్ణీత గడువులో ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# ఘనంగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్ కార్యక్రమం



**హుస్నాబాద్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్ కార్యక్రమం మినీ స్టేడియంలో ఉత్సాహంగా జరిగింది. జిల్లా డీవైఎస్‌వో వీరారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ కోచ్ రాజేష్, ఫెన్సింగ్ కోచ్ ఫణీంద్ర, వాలీబాల్ కోచ్ రిషిందర్ విద్యార్థులకు వార్మప్, కండిషనింగ్ వ్యాయామాలపై ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు.క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక వికాసం సాధ్యమవుతుందని వారు వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి విద్యార్థులు క్రమశిక్షణతో క్రీడల్లో రాణించాలని సూచించారు. ఎంఈఓ బండారి మనీలా చదువుతో పాటు క్రీడలను సమన్వయం చేసుకోవాలని అన్నారు. హుస్నాబాద్ మోడల్ స్కూల్, బెజ్జంకి మైనారిటీ వెల్ఫేర్ పాఠశాలల నుంచి వచ్చిన 300 మంది విద్యార్థులు వ్యాయామాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, కౌన్సిలర్ సిహెచ్. అనూష, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి జె. వెంకట నర్సయ్య, పిడి ఆర్. శ్రీనివాస్, కబడ్డీ కోచ్ కృష్ణతో పాటు పలువురు పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# కుమ్మరి కుంట కబ్జాకు గురవుతోందని రైతులు ఆవేదన



**హుస్నాబాద్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ పట్టణంలోని కుమ్మరి కుంట కబ్జాకు గురవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మహమ్మదాపూర్ రోడ్‌లోని చిన్న కుమ్మరి కుంట (సర్వే నం. 81) విస్తీర్ణం ఒక ఎకరం 12 గుంటలు కాగా, కొంత వంది ఆక్రమించి వ్యవసాయం చేస్తున్నారని వారు ఆరోపించారు.కుంట పూడిక తీయకుండా అడ్డుపడటం వల్ల నీరు నిల్వ లేక భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని రైతులు తెలిపారు. 2023 నుంచి ఫిర్యాదులు చేసినా అధికారులు సూచిక బోర్డు ఏర్పాటు చేయలేదని, దీంతో కుంటను ఆక్రమించుకునే పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.కుంటను లోతుగా చేసి నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని, భూగర్భ జలాలు పెరిగేలా పూడిక తీయడానికి అనుమతి ఇవ్వాలని, కుంట భూమిని ప్రైవేటు పరం కాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని రైతులు అధికారులను కోరారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**- కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన ప్రజావాణిలో మొత్తం 170 దరఖాస్తులు స్వీకరించగా, వీటిలో గృహ నిర్మాణ శాఖకు 59, నగరపాలికకు 50 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చూడాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. వర్షా భావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖను సూచించారు. గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా పారిశుద్ధ్యం, రోడ్లు, కల్వర్టుల సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్ఓ స్వామి, ఆర్డీవో షర్మిలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జెసిఐ కరీంనగర్ శాతవాహనకు అవార్డుల పంట




**కరీంనగర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్‌లోని క్షత్రియ హోటల్‌లో నిర్వహించిన జెసిఐ జోన్ 12 "తేజస్ మీడికాన్ 2026" కార్యక్రమంలో జెసిఐ కరీంనగర్ శాతవాహన చాప్టర్ పలు విభాగాల్లో అవార్డులు అందుకుంది. సమాజ సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు ఈ గుర్తింపు లభించింది.ఈ సందర్భంగా జెసిఐ కరీంనగర్ శాతవాహన ప్రెసిడెంట్ ఆవుల సుధాకర్ సభ్యుల కృషికి కృతజ్ఞతలు తెలుపుతూ, జోన్ ప్రెసిడెంట్ గౌతమ్ కుమార్ జైన్, జెడ్‌విపి గుండం మహేందర్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా యువత కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్‌షిప్ క్వాలిటీస్ పెంపొందించుకోవడంతో పాటు వ్యాపార అభివృద్ధి సాధించవచ్చని, సమాజ సేవలో భాగస్వామ్యం కావచ్చని పేర్కొన్నారు. అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో సెక్రటరీ, ఐపిపి సయ్యం సాయిబాబు, జఫ్ డి లక్ష్మణ్ కుమార్ గొల్ల, జెసి గంగుల శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

# ముకుందలాల్ మిశ్రా భవన్‌లో కార్మిక రైతు సంఘాల జిల్లా సదస్సు




**కరీంనగర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సదస్సు జరిగింది. టీజీఆర్‌పీడీసీఎల్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, నాలుగు లేబర్ కోడులు రద్దు చేయాలని, విబి గ్రామ్ జి చట్టం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని సదస్సు కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది.సీఐటీయూ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ సన్నాహాలు సామాన్య వినియోగదారులు, రైతులపై భారాన్ని పెంచుతాయని ఆక్షేపించారు. ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి విదేశీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తాయని పేర్కొన్నారు. ఏఐఏడబ్ల్యూయూ జిల్లా కార్యదర్శి సుంకరి సంపత్ విబి గ్రామ్ జి పథకం రాష్ట్రాలపై పెను భారం మోపుతుందని అన్నారు.సదస్సులో కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని తీర్మానించారు. కార్యక్రమంలో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యాయి కల్లూరు ధర్మేంద్ర







**కరీంనగర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా 16వ మహాసభలు బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగాయి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, విద్యా--వైద్య రంగాల వాణిజ్యీకరణ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చుతున్నాయని ఆయన అన్నారు. ఉద్యోగ నియామకాలు వేగవంతం చేసి, యువతకు శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో యువజన సంక్షేమానికి ప్రత్యేక విధానం లేకపోవడం వల్ల వేలాది మంది యువత ఉద్యోగాలు, విద్య కోసం వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సెప్టెంబర్ 8--10 తేదీల్లో యాదగిరిగుట్టలో జరగనున్న రాష్ట్ర మహాసభల్లో విద్య--ఉపాధి హక్కుల సాధనకు కొత్త కార్యాచరణ రూపొందించనున్నట్లు ఏఐవైఎఫ్ ప్రకటించింది. కార్యక్రమంలో ఏఐ వైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు, 50 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్ఎంపీ సంఘ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు



**కరీంనగర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్ఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తొలి వైద్య సేవలు అందించేది ఆర్ఎంపీలేనని, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడుతున్నారని ప్రశంసించారు. కరోనా సమయంలో చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆర్ఎంపీ సంఘం సొంత భవన నిర్మాణానికి మున్సిపల్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అవసరమైతే మరో రూ.10 లక్షల వరకు సహాయం అందించేందుకు సిద్ధమని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు చెన్నమనేని నరసింహారావు, ప్రధాన కార్యదర్శి పైడిపల్లి కుమార్, కోశాధికారి కోల సంజీవరెడ్డి, గౌరవాధ్యక్షులు కాసం రవీందర్ రెడ్డి, వైద్యులు, సంఘ సభ్యులు, ఆర్ఎంపీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ రాజేశ్వరరావుకు డాక్టరేట్ ప్రధానం



**కరీంనగర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాడి పరిశ్రమ అభివృద్ధి, రైతుల సాధికారత కోసం చేసిన విశేష సేవలకు గుర్తింపుగా కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ చలిమెడ రాజేశ్వరరావుకు యూఎస్ఏ మేరీల్యాండ్ స్టేట్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటిం చింది.జూలై 19న న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో జరిగే కార్యక్ర మంలో ఆయన ఈ గౌరవాన్ని అందుకో నున్నా రు. రాజేశ్వరరావు నాయకత్వంలో కరీంనగర్ డెయిరీ 3 లక్షల లీటర్ల సామర్థ్యానికి విస్తరించి, రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచింది. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కొత్త ఉత్పత్తులు, పశుసంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు.ఇప్పటికే ఆయనకు ఇండియా డెయిరీ అవార్డు, ది హన్స్ ఇండియా అవార్డు,ఇండియన్ అగ్రికల్చర్ అవార్డు,ఉత్తమ పారిశ్రామికవేత్త,ఉత్తమ రైతు వంటి అనేక పురస్కారాలు లభించాయి.

## డ్రైనేజీ, కల్వర్టు పనుల్లో నాణ్యత లోపించింది పైడిపల్లి రాజు



**కరీంనగర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరంలోని 40వ డివిజన్ హనుమాన్ నగర్ పరిధిలో జరుగుతున్న డ్రైనేజీ, కల్వర్టు పనుల్లో నాణ్యత లోపించిందని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ఆరోపించారు. కల్వర్టు పోసిన 24 గంటల్లోనే పగుళ్లు రావడం, వాహనాలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోకపోవడం కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు నాణ్యత ప్రమాణాలు పరిశీలించకుండా కాంట్రా క్టర్‌కు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. హనుమాన్ నగర్‌లో జరిగిన పనులపై వెంటనే విచారణ జరిపి, నాణ్యత పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఓపెన్ జిమ్ పనులు ప్రారంభం




**హుస్నాబాద్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కోహెడ మండలంలోని సీసీపల్లి గ్రామంలో ఓపెన్ జిమ్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. హుస్నాబాద్ నియోజకవర్గ స్పోర్ట్స్ కమిటీ ఇన్‌చార్జ్ వెన్నరాజు ముగ్గు పోసి పనులను ప్రారంభించారు.గ్రామ సర్పంచ్ సంపత్‌కు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.5 లక్షలు మంజూరు చేయడంతో ఈ జిమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఉద్దేశంతో మంత్రి ఈ జిమ్‌ను మంజూరు చేశారని వెన్నరాజు పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గ్రామ కమిటీ, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ సాయి పవన్, గ్రామ సర్పంచ్ సంపత్, ఉపసర్పంచ్, మాజీ సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ అభివృద్ధి నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేసిన బొల్లి శ్రీనివాస్



**హుస్నాబాద్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహ్మదపూర్ గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని బొల్లి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చిన నిధులు కాంగ్రెస్ పార్టీ వర్గపోరాటాల కారణంగా ల్యాప్స్ అవుతున్నాయని, దీంతో గ్రామానికి రావలసిన వివో బిల్డింగ్, సీసీ రోడ్లు, పంచాయతీ భవనం వంటి పనులు వెనుకకు వెళ్లాయని ఆయన విమర్శించారు. మంత్రి పదవి వచ్చినా గ్రామాల అభివృద్ధి జరగకపోవడం కాంగ్రెస్ అసమర్థ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. వెంటనే నిధులు తీసుకువచ్చి, వెనుకకు వెళ్లిన పనులను మంజూరు చేసి గ్రామ అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలని, దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## వీధి దీపాల సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



**హుస్నాబాద్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పట్టణంలోని 18వ వార్డు బుడగజంగాల కాలనీలో గత 15 రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో చీకటి కారణంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా మెటీరియల్ ఇంకా రాలేదు అంటూ సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని వారు ఆరోపించారు.వెంటనే స్పందించి వీధి దీపాల సమస్యను పరిష్కరించి కాలనీలో విద్యుత్ వెలుగులు పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని 18వ వార్డు ప్రజలు కౌన్సిలర్ వాల్ల సుప్రజ నవీన్ రావును కోరుతున్నారు.

## ఎల్కతుర్తి దామెర రహదారిపై డ్రైనేజీ పనుల నిర్లక్ష్యం

**- మంతుర్తి శ్రీకాంత్ యాదవ్**



**హుస్నాబాద్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎల్కతుర్తి--దామెర ఎన్‌హెచ్ 765డీజీ రహదారిపై డ్రైనేజీ పనులు అసంపూర్తిగా ఉండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆరోపించారు.రోడ్డు పక్కన తవ్విన గుంతలు ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని, రాత్రివేళల్లో హెచ్చరిక బోర్డులు లేక ప్రజలు భయాందోళనల మధ్య ప్రయాణి స్తున్నారని తెలిపారు. డ్రైనేజీలో మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు, దుర్వాసన పెరిగి ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేసి రహదారిని సురక్షితంగా మార్చాలని, నిర్లక్ష్యానికి బాధ్యు లపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే ప్రజ లతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## అంగరంగ వైభవంగా ఓదెల మల్లన్న ఆలయంలో ఆషాఢ ఉత్సవాలు



**ఓదెల, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓదెల శ్రీ మల్లన్న ఆలయంలో ఆషాఢ ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా కొనసాగుతు న్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పెద్ద పట్నాలు, అగ్నిగుండం ప్రవేశం కార్యక్రమాలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణారావు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలతో ఎమ్మెల్యేను సత్కరించారు.ఈ సందర్భంగా విజయ రమణారావు రాష్ట్ర ప్రజలు సుఖశా ంతులతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని శ్రీ మల్లన్న స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకు న్నారు. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మ రణలు, శివనామస్మరణలతో మార్మో గింది. భక్తు లకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, ప్రజాప్ర తినిధులు, పార్టీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏఐకేఎంఎస్ నూతన జిల్లా కమిటీ ఎన్నిక





**ఖానాపూర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అఖిల భారత రైతు కూలీ సంఘం నిర్మల్--అదిలాబాద్ జిల్లా 11వ మహాసభల్లో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా కె. సర్దార్, ప్రధాన కార్యదర్శిగా ఎల్.ఆర్. ఉపాలి, ఉపాధ్యక్షులుగా అరికెల్ల కేశవ్, గోపి నరసయ్య, సహాయ కార్యదర్శులుగా గంగాధర్, శేఖర్, కోశాధికారిగా కుడుదుల రాజేష్, సభ్యులుగా జె. రాజు, మానక శ్రీనివాస్, దీనాజీ, గూట్ల ప్రసాద్, గోనే స్వామి, కనిశెట్టి ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా పోడు భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని, నిర్మల్--అదిలాబాద్ జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, గిరిజన ప్రాంతాలకు రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని తీర్మానం చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం నిధులు కేటాయించి రుణాలు, విత్తనాలను సబ్సిడీపై అందించాలని మహాసభలో నిర్ణయించారు.

## కూనారం ఆర్‌ఓబీ పనులు నెలాఖరులోగా పూర్తి చేయాలి



**- కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కూనారం రైల్వే ఫ్లైఓవర్ పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయకుండా వేగవంతంగా పూర్తి చేసి జూలై నెలాఖరులోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టర్ కూనారం ఆర్‌ఓబీ నిర్మాణ పనులను పరిశీలించి విద్యుత్, రెవెన్యూ, ఆర్ అండ్ బి శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి పనుల పురోగతిని వేగవం తం చేయాలని సూచించారు. ఎలాంటి సమ స్యలు ఎదురైనా క్షేత్రస్థాయిలోనే పరిష్కరించి పనులు నిరంతరాయంగా కొనసాగాలని ఆదేశించారు.తరువాత పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో ఓటరు నమోదు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమీక్షించిన కలెక్టర్, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను ఈ నెల 18వ తేదీలోగా పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ప్రతి ఓటరు ఫారాలు తప్పనిసరిగా నింపి బీఎల్వోలకు అందజేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పూర్తి సహకారం అందించాలని సూచించారు.ఈ పర్యటనలో ఆర్ అండ్ బి ఈఈ భావ్‌సింగ్, ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ గంగాధర్, ఆర్డీవో గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## కార్పోరేట్ ఆసుపత్రి పై ప్రజావాణిలో ఫిర్యాదు

**కరీంనగర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నగరంలోని సన్‌షైన్ హాస్పిటల్‌లో చట్టపరమైన ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు కలెక్టరేట్‌లో ప్రజావాణి ద్వారా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు సమర్పించారు.జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ ఆసుపత్రి ఎన్డిపిఎస్ చట్టాలను ఉల్లంఘిస్తోందని, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు లేకపోవడం ప్రజల ప్రాణాలకు ముప్పు అని పేర్కొన్నారు. ఆసుపత్రి రిజిస్ట్రేషన్, ఫార్మసీ లైసెన్స్ రద్దు చేసి, ఆరోగ్యశ్రీతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకాల అనుబంధాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆధ్వర్యంలో 10 రోజుల్లో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజిరెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

## జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్‌కు ఘన స్వాగతం



**హైదరాబాద్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఘన స్వాగతం పలికారు.తెలంగాణ పర్యటనలో భాగంగా హైదరాబాద్‌లో మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆయనను శాలువాతో సత్కరించి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలపై చర్చ జరగగా, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

## అమరవీరుల స్థూప స్థలంలో అక్రమ నిర్మాణం పై పిర్యాదు



**హుస్నాబాద్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు స్థూప స్థల సాధన కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.సర్వే నంబర్ 1189/బి లో ముత్తినేని రాజేశ్వర్ రెడ్డి స్థూపం ముందు అక్రమ నిర్మాణం చేపట్టారని కమిటీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. మున్సిపాలిటీ ఇప్పటికే మొదటి నోటీసు ఇచ్చిన విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా, రెండవ నోటీసు జారీ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, కో-ఛైర్మన్లు గడిపే మల్లేష్, ఎండి. అన్వర్, గాదెపాక రవీందర్, ముక్కెర సంపత్ కుమార్, గన్నేబోయిన రాజేశం, ప్రధాన కార్యదర్శి మేకల వీరన్న యాదవ్, కార్యదర్శులు గూడ పద్మ, బండి పుష్ప, గజవెల్లి మురళి, పెట్టెం కుమారస్వామి, నాంపల్లి సమ్మయ్య, పెద్ది నిర్మల, పూదరి రవీందర్, ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, జనగామ రాజకుమార్, గంబీరపు మధు, వేల్పుల రాజు, పచ్చిమట్ల శ్రీనివాస్ గౌడ్, అబ్బరబోయిన రవి, అలుమల్ల ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సోమనదేశ్వర ఆలయ నిర్మాణానికి భారీ విరాళం



**గన్నేరువరం, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మైలారం గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ద్వాదశ జ్యోతిర్లింగాల నిర్మాణం కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమనదేశ్వర ఆలయ నిర్మాణానికి మడికంటి శ్రీనివాస్--హాసిని దంపతులు రూ.50,116 విరాళం అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ వరాల పర్శరాములు విరాళాన్ని స్వీకరించారు. ఆలయ అర్చకులు మామిడాల నాగసాయి శెర్మ ఆలయ అభివృద్ధికి సహకరించిన వారిని అభినందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జక్కనపెల్లి సత్తయ్య, అక్కనపెల్లి రాజేష్, నూకల తిరుపతి, నూకల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## లాజికల్ రీజనింగ్ ఒలంపియాడ్‌లో బంగారు పతకం సాధించిన అల్ఫోర్స్ విద్యార్థులు




**కరీంనగర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల విద్యార్థులు జాతీయ లాజికల్ రీజనింగ్ ఒలంపియాడ్‌లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారు.9వ తరగతి విద్యార్థి ఎన్. సహ్రష్ బంగారు పతకం తో పాటు రూ.1000 నగదు బహుమతి గెలుచుకోగా, 8వ తరగతి విద్యార్థి జి. సహంష్ ప్రశంసా పత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే విశ్లేషణాత్మక అవగాహన కల్పిస్తే పోటీ పరీక్షల్లో విజయాలు సాధించగలరని పేర్కొన్నారు. విజేతలకు పుష్పగుచ్చాలు అందజేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలోద పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శివాలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు



**సుల్తానాబాద్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సుల్తానాబాద్ శివాలయంలో విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి వల్లంకొండ రమేష్ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, ఫలాభిషేకం, ప్రత్యేక అర్చనలు ఘనంగా జరిగాయి. ఆలయ చైర్మన్, డైరెక్టర్లు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పరమేశ్వరుని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగి ఆధ్యాత్మిక వాతావరణంలో కార్యక్రమం కొనసాగింది.

# జిల్లాలో ఘనంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

**కరీంనగర్/నిర్మల్ జిల్లా, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ఉత్సాహంగా జరిగింది. రేణికుంట గ్రామంలో సర్పంచ్ ఎలుక అంజనేయులు పిల్లలకు మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలకు ఆరోగ్య శాఖ మార్గదర్శకాల మేరకు మాత్రలు అందజేశారు. కరీంనగర్ నగరంలోని సుభాష్‌నగర్ పాఠశాలలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, మేయర్ కొలగాని శ్రీనివాస్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే దేశ భవిష్యత్తు బలంగా ఉంటుందని మేయర్ పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నులిపురుగుల వల్ల పోషకాహార లోపం, రక్తహీనత, ఎదుగుదలలో ఆటంకాలు ఏర్పడతాయని, మాత్రలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. హుజురాబాద్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ



చేశారు. సుల్తానాబాద్‌లో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో కార్యక్రమం జరిగింది. ప్రజాప్రతినిధులు చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలంటే ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో డిసిసి ఉపాధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం ఆశ్రమ బాలుర పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. పద్మావతి నగర్ అంగన్వాడీ కేంద్రంలో వార్డ్ కౌన్సిలర్ నిమ్మల రమేష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బర్కత్పురా అంగన్వాడీలో మున్సిపల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ షోయెబ్ హుస్సేన్ విద్యార్థులకు స్వయంగా మందు వేసి, పోషకాహారం తీసుకున్న తర్వాతే మందు వేసుకోవాలని సూచించారు. జిల్లాల వ్యాప్తంగా జరిగిన ఈ కార్యక్రమాల్లో వైద్య, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూ సర్వే శిక్షణ ప్రారంభం



**కరీంనగర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రభుత్వ జీపీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన భూ సర్వే శిక్షణ కార్యక్రమాన్ని కరీంనగర్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా, వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. అధికారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. శిక్షణలో భూ సర్వే ప్రక్రియ, నిబంధనలు, సాంకేతిక విధానాలు, ఫీల్డ్ స్థాయిలో అనుసరించాల్సిన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్. కిషన్, అబ్జర్వర్ ప్రవీణ్, హర్మిందర్ సింగ్, రామేశ్వర, గణపతి, ధర్మారెడ్డి, శ్రీనివాస్, బింగి, కోట రామస్వామి తదితర అధికారులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ కమిషనరేట్‌లో నేరాల సమీక్ష సమావేశం



**కరీంనగర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2026 తొలి అర్ధవార్షిక నేరాల సమీక్షా సమావేశం కమిషనర్ గౌష్ ఆలం నేతృత్వంలో జరిగింది. సమావేశంలో 2025, 2026 అర్ధవార్షిక నేరాల గణాంకాలను విశ్లేషిస్తూ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, నిర్దేశిత కాలంలో చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆయన ఆదేశించారు. మహిళలు, చిన్నారుల భద్రత, ఎస్సీ ఎస్టీ చట్టాలు, పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సైబర్ నేరాల అదుపు, మొబైల్ చోరీల నివారణకు సీఈఐఆర్ పోర్టల్ వినియోగం, ఆధునిక సాంకేతిక వేదికల వినియోగం, నగరంలో సీసీ కెమెరాల ఏర్పాటు, జియో ట్యాగింగ్ పురోగతిని సమీక్షించారు. డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని, యువతలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ ప్రమాదాల నివారణకు బ్లాక్‌స్పాట్‌లను సరిదిద్దాలని, హిట్ అండ్ రన్ కేసులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అక్రమ పీడీఎస్ బియ్యం రవాణా, ఇసుక మాఫియా, గ్యాంబ్లింగ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, రాత్రి గస్తీని పెంచాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యమని, విధుల్లో అలసత్వాన్ని సహించబోమని కమిషనర్ గౌష్ ఆలం హెచ్చరించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేత



**కరీంనగర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిర్వహణ పనుల కారణంగా కరీంనగర్ పట్టణం, రూరల్ పరిధిలో మంగళవారం (జూలై 14) విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉజ్వల పార్క్, రామచంద్రపూర్, వావిలాలపల్లి, బ్యాంక్ కాలనీ, పీటీసీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడనుంది. రేకుర్తి, సాతవాహన, బద్దిపల్లి సబ్‌స్టేషన్లలో కూడా నిర్వహణ పనులు చేపట్టనున్నందున పాక్షికంగా విద్యుత్ అంతరాయం ఉంటుంది. శ్రద్ధాయిని హోటల్, ఎన్టీఆర్ విగ్రహం, డి-మార్ట్, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాల, రేకుర్తి, ఇందిరమ్మ కాలనీ, స్వామి కాలనీ, సీతారాంపూర్, ఆర్టీసీ కాలనీ, గౌడాస్ కాలనీ, సంతోష్‌నగర్, భాగ్యనగర్, జ్యోతినగర్, విద్యానగర్, శ్రీరాంనగర్, చైతన్యపురి, చింతకుంట, బద్దిపల్లి, నాగుల మల్లియాల్, కమాన్‌పూర్, ఖాజీపూర్, మల్కాపూర్, లక్ష్మీపూర్ గ్రామాలు, గ్రానైట్ పరిశ్రమలు, రెడ్డి ఫంక్షన్ హాల్, హిందూపురి కాలనీ, ఆర్టీసీ వర్క్‌షాప్, మెహర్‌నగర్, శ్రీహరినగర్, వినాయకనగర్, రాంనగర్ వంటి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడనుంది. వినియోగదారులు విద్యుత్ అంతరాయాన్ని గమనించి సహకరించాలని అధికారులు కోరారు.

# విద్యారంగంపై ప్రభుత్వం దృష్టి

**పెద్దపల్లి, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు. పెద్దపల్లి మండలంలోని హనుమంతుని పేట, మారేడు గొండ, మూలసాల, గుర్రంపల్లి గ్రామాల్లో డీఎంఎఫ్‌టి నిధులతో రూ.1.18 కోట్ల వ్యయంతో పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, రిపేర్లు, టాయిలెట్స్, కిచెన్ షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండలంలో మొత్తం రూ.5.70 కోట్ల నిధులు స్కూళ్ల మౌలిక సదుపాయాల కోసం మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తున్నారని, మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందిస్తున్నారని చెప్పారు. నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, గత సంవత్సరం ఎస్ఎస్‌సీ ఫలితాల్లో రాష్ట్రంలో పెద్దపల్లి జిల్లా అగ్రస్థానంలో నిలవడం అభినందనీయమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ స్కూళ్లను నిర్లక్ష్యం చేసి, ప్రైవేట్ విద్యాసంస్థలకు ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వ స్కూళ్లపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంఖ్య పెరగడానికి కృషి చేయాలని



కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో ఎస్ఐఆర్ ఫారాల పంపిణీ



**కరీంనగర్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ పట్టణంలోని 39వ డివిజన్ పరిధిలో పోచమ్మ దేవాలయం వద్ద ఫారాల పంపిణీ, స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ హాజరై ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి పర్యవేక్షించారు. బీఎల్‌ఓలకు విధివిధానాలపై పలు సూచనలు చేశారు. బీజేపీ కార్పొరేటర్ మాసం గణేష్ అధికారులతో కలిసి ఫారాల సేకరణ ప్రక్రియను పరిశీలించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

# జడ్పీ సీఈఓపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**పెద్దపల్లి, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ కె. నరేందర్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా హెడ్‌క్వార్టర్స్‌లో నివసించడం లేదని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఫిర్యాదుదారు సముద్రాల రమేష్ తెలిపిన వివరాల ప్రకారం, నరేందర్ పెద్దపల్లి జిల్లాకు బదిలీపై వచ్చినప్పటి నుంచి మంచిర్యాల జిల్లా లోని తన స్వగృహం నుంచి ప్రతిరోజూ రాక పోకలు సాగిస్తూ విధులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. సివిల్ సర్వీసెస్ రూల్స్, జీవో నెంబర్ 20 ప్రకారం ఉద్యోగులు ప్రధాన కార్యాలయం పరిధిలోనే నివసించాలి. హెడ్‌క్వార్టర్స్‌లో నివసించని ఉద్యోగికి ఇంటి అద్దె భత్యం పొందే అర్హత ఉండదని, గత మూడు సంవత్సరాలుగా పొందిన మొత్తాన్ని రికవరీ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

# 15న మహాధర్నా జయప్రదం చేయండి



**నల్లగొండ, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 15న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి తెలిపారు. సోమవారం మహాత్మా గాంధీ యూనివర్సిటీ, జిల్లా గ్రంథాలయం, మల్లు వెంకట నరసింహారెడ్డి విజ్ఞాన కేంద్రం లైబ్రరీతో పాటు పట్టణంలోని పలు స్టడీ హాళ్లలో కరపత్రాలు పంచి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన దేశం మనది. కానీ పాలకులు యువత సామర్థ్యాన్ని దేశాభివృద్ధికి వినియోగించడంలో విఫలమవుతున్నారు. నిరుద్యోగ సమస్యలతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు పేపర్ లీకేజీలు, పరీక్ష వాయిదాలు, కోర్టు వివాదాలతో వమ్మయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు కేవలం 16 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. "నిరుద్యోగ సమస్య పరిష్కారం ప్రభుత్వ చారిత్రక బాధ్యత. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి. 15న జరిగే మహాధర్నాలో యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలి" అని తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాలడుగు నాగార్జున, దండంపల్లి సత్తయ్య, నలపరాజు సైదులు, మల్ల మహేష్, ఆకారపు నరేష్, బొల్లు రవీందర్, పోలే సత్యనారాయణ, మేడి కిరణ్, జంజిరాల శ్రీనివాస్, కిరణ్ అదిల్ తదితరులు పాల్గొన్నారు.

# వివోఏలకు కనీస వేతనం రూ.18 వేలుగా చెల్లించాలి



## - ఉద్యోగ సంఘం డిమాండ్

**తిప్పర్తి, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వివోఏ ఉద్యోగులకు కనీస వేతనం రూ.18 వేలుగా చెల్లించాలని, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఐకెపి వివోఏ ఉద్యోగ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తిప్పర్తి మండల కేంద్రంలోని ఏపీఎం కార్యాలయం ముందు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా జరిగింది. జిల్లా ఉపాధ్యక్షురాలు మంత్రాల మంగమ్మ, మండల అధ్యక్ష కార్యదర్శులు ఎండి రూమణ, జక్కలి అనిత మాట్లాడుతూ, "గత 25 ఏళ్లుగా గ్రామస్థాయిలో మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.18 వేల వేతన హామీని వెంటనే అమలు చేయాలి" అని ప్రభుత్వాన్ని కోరారు. అదనంగా రూ.10 లక్షల సాధారణ భీమా, ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలని, ప్రతి గ్రామ సంఘానికి ట్యాబ్, నెట్ సదుపాయం ఇవ్వాలని, ఆదాయం లేని సంఘాలకు రూ.20 లక్షల ప్రత్యేక నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సామ్రాజ్యం, సువర్ణ, కవిత, జానకమ్మ, జయమ్మ, సునీత, వసుమతి, కాశింబి, పరశురాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
మంగళవారం, జూలై 14, 2026



## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైంది



### – టీడబ్ల్యూజేఎఫ్

**పెద్దపల్లి, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పైడాకుల బిక్షపతి విమర్శించారు. పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు కలెక్టర్ కార్యాలయం వద్ద ఫ్లాకార్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నారని, ఉద్యమాల్లో ప్రాణాలకు తెగించి పోరాడారని కానీ ఇప్పటికీ వారి జీవన ప్రమాణాల్లో మార్పు కనిపించడం లేదని అన్నారు. అక్రిడిటేషన్ కార్డులు సకాలంలో ఇవ్వకపోవడం, హెల్త్ కార్డులు లేకపోవడం, ఇళ్ల స్థలాలు కేటాయించకపోవడం, ఉచిత బస్సు, రైల్వే పాసులు అందించకపోవడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సకు హెల్త్ కార్డులు అందించాలని, పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జంగాపల్లి సాగర్, షాబీర్ పాషా, పూసాల రవి, గౌడ సతీష్ కుమార్, సంపత్ కుమార్, సొత్కు రమేష్, నల్లూరి లింగన్న, శంకరయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా విద్యాధికారిని సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్



**నాగర్‌కర్నూల్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా విద్యాశాఖ పరిపాలన పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆరోపిస్తూ, జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ను వెంటనే సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని విద్యాశాఖ కార్యా లయం ఎదుట ఎంఎస్ఎఫ్, ఏఐఎస్ఎఫ్, బిఎస్ఎఫ్, యుఐఎస్ఎఫ్, బీసీ విద్యార్థి సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం ప్రజావాణిలో ఫిర్యాదు సమర్పించారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలలపై పర్యవేక్షణ లేకపోవడం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో సమస్యలను పట్టించుకోకపోవడం, ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో నెం.1) అమలు చేయకపోవడం, పాఠ్య పుస్తకాల విక్రయాలను అడ్డుకోవాల్సిన అధికారులు వాటికి సహకరించడం వంటి అంశాలను తీవ్రంగా విమర్శించారు. అచ్చంపేట శ్రీ చైతన్య పాఠశాలపై బాలల హక్కుల కమిషన్ ఆదేశించిన విచారణను కూడా డీఈఓ పట్టించుకోలేదని ఆరోపించారు. తిమ్మాజిపేట కేజీబీవీ ప్రత్యేక అధికారి సుజాతపై వచ్చిన ఆరోపణలను పట్టించుకోకుండా, లోపాలను ప్రశ్నించే సిబ్బందికే షోకాజ్ నోటీసులు జారీ చేయడం విచారకరమని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ పనితీరుపై సమగ్ర విచారణ జరిపి, జిల్లా విద్యాధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులను విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్ కుమార్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుక్కాపురం మహేష్, బిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మద్దెలబండ సాయిబాబు, యుఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దేగ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శివపల్లిలో సీసీ రోడ్లకు శంకుస్థాపన

### చేసిన ఎమ్మెల్యే విజయరమణరావు



**ఎలిగేడు, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని శివపల్లి గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు జరిగాయి. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు స్థానిక నాయకులతో కలిసి రూ. 10 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచ్ దుగ్యాలవాణి గోపాల్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు రాజేశ్వర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు దుగ్యాల సంతోష్ రావుతో పాటు పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి దిశగా నిధులు కేటాయించి పనులు ప్రారంభించినందుకు ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్నినో పరిస్థితులను అనుసరించి పంటలు సాగు చేయాలి

### – ఏవో ఉమాపతి



**ఎలిగేడు, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని బుర్హామీయాపేట గ్రామంలో సోమవారం క్షేత్ర పర్యటన నిర్వహించిన మండల వ్యవసాయ అధికారి ఎం. ఉమాపతి రైతులకు ఎల్ నినో వర్షాభావ పరిస్థితులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాభావం కారణంగా నీటి లభ్యత తగ్గిపోతుందని, రైతులు బోరు బావులలో నీటి పరిస్థితిని పరిశీలించి వరి నాట్లు వేసుకోవాలని సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అరుతడి పంటలైన మొక్కజొన్న, పెసర్లు, బబ్బెర్లు, నువ్వులు సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు. వ్యవసాయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా రైతులు వర్షాభావ ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ గణేష్, రైతులు పాల్గొన్నారు.

## గాయత్రి కళాశాలలో రోడ్డు భద్రత అవగాహన సదస్సు



**పెద్దపల్లి, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గాయత్రి డిగ్రీ & పీజీ కళాశాలలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ విద్యార్థులకు రోడ్డు భద్రత నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. టూ వీలర్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు, ఇన్సూరెన్స్, రోడ్డు టాక్స్ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, ట్రిపుల్ రైడ్, అతివేగం, ఓవర్‌టేక్ చేయరాదని, జీబ్రా క్రాసింగ్, స్కూల్ జోన్లలో పాదచారులను గమనిస్తూ ప్రయాణించాలని విద్యార్థులకు సూచించారు. అమ్మాయిలకు మొబైల్ లో తెలియని వారితో చాటింగ్ చేయరాదని, ఫోటోలు పంపరాదని, తెలియని నంబర్ల నుంచి కాల్స్ లేదా మెసేజ్‌లు వచ్చినా షీ టీమ్‌కి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జే. రవీందర్, లెక్చరర్లు పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యా ప్రమాణాలపై కలెక్టర్ హేమంత్ కేశవ్ పటేల్ దృష్టి




**చారకొండ, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పటేల్ సోమవారం ఉదయం చారకొండ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థినులతో ప్రత్యక్షంగా ముచ్చటించి వారి అభ్యాస స్థాయిని అంచనా వేసిన కలెక్టర్, పాఠశాల నిర్వహణ, వసతి, భోజన నాణ్యత, పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లు, వైద్య సేవలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. జీవశాస్త్రం సబ్జెక్టులో విద్యార్థినులకు ప్రశ్నలు అడిగి వారి అవగాహనను పరీక్షించిన కలెక్టర్, "ప్రతి అంశాన్ని పూర్తిగా అర్థం చేసుకుని చదివితేనే మంచి ఫలితాలు సాధించవచ్చు" అని సూచించారు. భోజన నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారించి, వారాంతపు మెనూ అమలును విద్యార్థినుల వద్దే తెలుసుకున్నారు. పోషకాహార ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయులతో మాట్లాడిన కలెక్టర్, వెనుకబడిన విద్యార్థినులకు అదనపు శిక్షణ అందించాలని, ఇంటర్మీడియట్, పదో తరగతి విద్యార్థినులకు ప్రత్యేక అధ్యయన ప్రణాళిక రూపొందించి అత్యుత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. "క్రమశిక్షణ, కష్టపడి చదివే అలవాటు, సమయపాలన విజయానికి పునాది" అని విద్యార్థినులకు ప్రేరణనిచ్చారు. ప్రభుత్వం కేజీబీవీల బలోపేతానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటి లక్ష్యం ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చారకొండ తహసీల్దార్ ఉమా, ప్రత్యేక అధికారి మంజుల, గ్రామ సర్పంచ్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## దేవరకొండనుండిహైదరాబాద్ రూట్ లో ఎలక్ట్రికల్ డీలక్స్



**దేవరకొండ జూలై 13 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :** దేవరకొండ నుండి హైదరాబాద్ కు ఎలక్ట్రికల్ ఈ డీలక్స్ బస్సులు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ విజయకుమారి తెలిపారు. సోమవారం బస్సులు ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ.. దేవరకొండ-హైదరాబాద్ రూట్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల కొత్తగా 4 ఈ-డీలక్స్ బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవరకొండ నుంచి హైదరాబాద్ కు రూ.170.00, కొండమల్లేపల్లి నుంచి రూ.160.00 చార్జీలు వర్తిస్తాయని తెలిపారు. ఈ బస్సులలో "మహాలక్ష్మి పథకం" వర్తించదని అన్నారు. డిపో పరిధిలోని ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి జెఎస్సెస్



**పెద్దపల్లి, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలని జర్నలిస్టుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెన్నంపల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జెఎస్సెస్ జాతీయ అధ్యక్షుడు మానసాని కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులు తక్కువ వేతనాలతో జీవనం సాగిస్తు న్నారని, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ వారధిగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అటువంటి జర్నలిస్టుల పిల్లలకు విద్యాశాఖ ద్వారా 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలని, దీనిపై వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఇప్పటికే విద్యాసంస్థలు ఫీజులు అడుగుతున్నందున కలెక్టర్ తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈ విషయంపై విద్యాశాఖ అధికారులతో చర్చించి త్వంలోనే ఉత్తర్వులు జారీ చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్న లిస్టుల స ంక్షేమ సంఘం సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## వివోఏలకు కనీస వేతనం రూ.26 వేలుగా చెల్లించాలి సిహెచ్ లక్ష్మీనారాయణ




**నల్లగొండ, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వివోఏ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యుడు సిహెచ్ లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండ మండల సమాఖ్య కార్యా లయం ముందు వివోఏలతో కలిసి ధర్నా నిర్వహించి, అనంతరం ఏపీఎం వినోద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయి" అని పేర్కొన్నారు. వివోఏలను సేర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని, కనీసం రూ.18 వేల రూపాయలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం రోజుకు రూ.175 చొప్పున నెలకు రూ.4550 మాత్రమే చెబుతుండగా, రాష్ట్ర ప్రభుత్వం కూడా వివోఏల శ్రమను గుర్తించడంలో విఫలమవుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కార్మికులకు కనీస వేతనాలు సవరించిన జీవో ప్రకా రం నైపుణ్యం లేని కార్మికులకు రూ.14 వేల, సెమీ స్కిల్ వర్కర్లకు రూ.16 వేల, నైపుణ్యం ఉన్న వారికి రూ.18 వేల వేతనం నిర్ణయిం చిందని గుర్తు చేశారు. వివోఏలు ట్యాబ్‌లలో పనిచేస్తున్నందున నైపుణ్యం ఉన్నవారిగా పరిగణించి కనీసం రూ.18 వేల వేతనం చెల్లిం చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు దండంపల్లి సత్తయ్య, మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ, యూనియన్ నాయకులు జిల్లపల్లి మంగ, కాసర్ల సువర్ణ, వివోఏలు జె. సంతోష, పి. సంధ్య, యు. శైలజ, బి. యాదవమ్మ, కె. కవిత, పద్మ, నర్మదా, కే. రాజేశ్వరి, జి. కృష్ణవేణి, డి. ధనమ్మ, పార్వతమ్మ, సుచిత్ర, సం ధ్య, కె. మంగమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

### –ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి తీదేడు గ్రామ సర్పంచ్



**దేవరకొండ జూలై 13. (నీలగిరి ఎక్స్ ప్రెస్) :** చింతపల్లి మండలం తీదేడు గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో నులి పురుగుల నివారణ మాత్రలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె అన్నారు. ప్రతి చిన్నారికి తప్పనిసరిగా ఈ మాత్రలు వేయించడం ద్వారా శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు. తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు లోను కాకుండా ప్రభుత్వ సూచనల మేరకు పిల్లలకు మాత్రలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి, వార్డు సభ్యులు మాదగోని కృష్ణ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు సిమర్ల శ్రీను యాదవ్, మెరిక శంకరయ్య, వైద్య ఆరోగ్య శాఖ ఏ ఎన్ ఎమ్ లు లలిత, రామలక్ష్మి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం



**దేవరకొండ జూలై 13. (నీలగిరి ఎక్స్ ప్రెస్) :** దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామంలో నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్బేండజోల్ మాత్రలను స్థానిక సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ఎమ్ ఎల్ ఎచ్ పిస్వాతి, మాజీ ఉప సర్పంచ్ వెంకట్, కొర్ర శ్రీను, లైన్ మెన్ శివ, పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్ , పాఠశాల ఉపాధ్యాయులు జగదీష్, అంగన్వాడీ ఆయా కళ్ళమ్మ, తదితరులు పాల్గొన్నారు.

RNI - TELTEL/2023/87644

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక




## పటేల్ నగర్ సమస్యలపై కమిషనర్‌కు లేఖ



**నల్లగొండ, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సాగర్ రోడ్ డాన్ బోస్కో స్కూల్ పక్కనగల 9వ డివిజన్ పటేల్ నగర్ కాలనీలో మిషన్ భగీరథ మంచినీళ్లు, వీధి లైట్లు, రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు కాలనీవాసులు లేఖ రాశారు. లక్షల రూపాయలు పెట్టి మున్సిపల్ పర్మిషన్ తీసుకొని ఇళ్లు నిర్మించుకున్న ఉద్యోగులు, వ్యాపారులు, మధ్యతరగతి ప్రజలు నివాసం ఉంటున్న ఈ ప్రాంతంలో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచినీళ్లు రాక డబ్బులు పెట్టి కొనుక్కోవాల్సిన పరిస్థితి, వీధి లైట్లు లేక రాత్రిపూట చీకటిమయం కావడం, పాములు--తేళ్లు తిరగడం, రోడ్లు గుంతలతో ప్రమాదకరంగా మారడం, వర్షం పడితే బురదమయం కావడం ప్రజలను సతమతం చేస్తున్నాయి. అదే విధంగా పక్కన ఏనిమీద గల ప్రభుత్వ స్థలంలో నివాసముంటున్న వారి ఇళ్లకు సరైన డ్రైనేజీ లేక మురుగు నీరు పటేల్ నగర్ ప్లాట్లలోకి చేరి దుర్గంధం, దోమలు, పందుల సమస్యలు పెంచుతోంది. చెత్త బండి సరిగా రాక ప్రజలు చెత్తను ఖాళీ ప్లాట్లలో వేసి ఆ ప్రాంతాన్ని మరో డంపింగ్ యార్డ్‌లా మార్చుతున్నారు. "లక్షల రూపాయలు పెట్టి ఇళ్లు నిర్మించుకున్నా కనీస సౌకర్యాలు అందక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాం. వెంటనే జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించాలి" అని కాలనీవాసులు కమిషనర్‌ను కోరారు.

## న్యాయం కోసం కొనసాగుతున్న 98 జీవో బాధితుల దీక్షలు



**నందికొట్కూరు, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రీశైలం ముంపు బాధితులు తమ హక్కుల సాధన కోసం నందికొట్కూరు పట్టణంలో నిరవధిక దీక్షలు కొనసాగిస్తున్నారు. సోమవారం 110వ రోజుకు చేరిన ఈ దీక్షలో బాధితుడు జయన్న మాట్లాడుతూ, "కడుపులు కాలుతున్నా, కన్నీరుమున్నీరైనా న్యాయం కోసం పోరాటం ఆగదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. తాము చేసిన త్యాగాల ఫలితంగా రాష్ట్రం నుండి చెన్నై వరకు 1600 కిలోమీటర్లకు తాగునీరు, 8 లక్షల హెక్టార్లకు సాగు నీరు, 1470 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధ్యమైందని గుర్తు చేశారు. కానీ ప్రాజెక్ట్ నిర్మాణానికి తమ యావదాస్థి త్యాగం చేసిన నిర్వాసితులకు ఇప్పటికీ హామీలు అమలు కాలేదని, ప్రతి ఎన్నికల్లో సమస్యను ఆయుధంగా ఉపయోగించుకుంటూ పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. "మా హక్కులు సాధించే వరకు విశ్రాంతి లేదు. మా జీవితపు వెలుగు చూసేదాకా దీక్షలు కొనసాగుతాయి" అని జయన్న స్పష్టం చేశారు. ఈ దీక్షలో నాగేంద్ర, జమ్మన్న, మౌలాలి, నాగరాజు, నాగసుంకన్న, రఫి, మాధవ్, నాగరాజు మల్యాల, రామకృష్ణ, జయన్న తదితరులు పాల్గొన్నారు.

## దివ్యంగుల కార్పొరేషన్ పదవి మహిళలకే ఇవ్వాలి



**హైదరాబాద్, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ దివ్యంగుల మహిళా నాయకులు సోమవారం మలక్పేట్‌లోని దివ్యంగుల కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గత నలభై ఏళ్లుగా కార్పొరేషన్ చైర్మన్ పదవిని పురుషులకే కేటాయించిన ప్రభుత్వాలు, ఈసారి మాత్రం మహిళలకు అవకాశం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో, దివ్యంగుల కార్పొరేషన్ చైర్మన్ పదవిని మహిళలకు కేటాయించాలని వారు కోరారు. "మహిళలకు పదవి ఇవ్వకపోతే సీఎం ఇంటి ముందు ఆమరణ నిరాహార దీక్ష చేస్తాం" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ దివ్యంగుల మహిళా నాయకులు పాల్గొన్నారు.

## జలధార జలహారతి పనులపై సీఎం సమీక్ష



**నందికొట్కూరు, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న జలధార--జలహారతి కార్యక్రమం అమలు పురోగతిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం పోలవరం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొని, జిల్లాలో చేపట్టిన పనుల పురోగతిని ముఖ్యమంత్రికి వివరించారు. సమీక్షలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యనారాయణ, ఇరిగేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ శంకర్ రెడ్డి,
భూగర్భ జలాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రఘురాం
తదితర అధికారులు పాల్గొన్నారు.

# నల్లగొండ పోలీసుల పనితీరును ప్రశంసించిన డిఐజి జోయల్ డేవిస్

**నల్లగొండ, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యాదాద్రి జోన్--ం డిఐజి డి. జోయల్ డేవిస్, ఐపీఎస్ సోమవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతలు, నేర నియంత్రణ, దర్యాప్తు ప్రమాణాలు, సైబర్ నేరాల నివారణ, ట్రాఫిక్ నిర్వహణ, మాదకద్రవ్యాల నిరోధక చర్యలు, కమ్యూనిటీ పోలీసింగ్ అంశాలపై సమీక్ష నిర్వహిం చారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ జిల్లా పోలీసింగ్, నేర ధోరణులు, పెండింగ్ దర్యాప్తులు, ప్రజా సేవలు, సాంకేతికత ఆధారిత కార్యక్రమాలపై సమగ్ర నివేదిక సమర్పించారు. నల్లగొండ పోలీసుల పనితీరును డిఐజి ప్రశంసిస్తూ, పారద ర్శకమైన, సమర్థవంతమైన, ప్రజా కేంద్రీకృత పోలీసింగ్ అంది ంచడం ప్రతి అధికారికి ప్రధాన లక్ష్యంగా ఉండాలని సూచి ంచారు. నివారణ పోలీసింగ్, ఇంటెలిజెన్స్ ఆధారిత చర్యలు, శాస్త్రీయ--ఫోరెన్సిక్ ఆధారాలతో నాణ్యమైన దర్యాప్తు, మాద కద్రవ్యాల స్మగ్లర్లపై పటిష్ట నిఘా, ప్రజల్లో సైబర్ క్రైమ్ అవగాహన పెంపు వంటి అంశాలపై ఆయన దృష్టి సారించారు. తరువాత ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆధ్వర్యంలో డీఎస్పీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌ఓలతో సమావేశం నిర్వహించి, నేర నివారణ, పెండింగ్ కేసులు, కమ్యూనిటీ పోలీసింగ్, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సమీక్ష చేసి, మరింత మెరుగుదల కోసం ఆదేశాలు జారీ చేశారు.




# కరాటే లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్

**- విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయులు**

**దేవరకొండ జూలై 13.(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** హైదరాబాద్ లో ఇటీవలగచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మెగా కరాటే ప్రదర్శన 45 నిమిషాల పాటు నిరంతర విన్యాసాలతో వరల్డ్ గిన్నిస్ స్థాయిలో రికార్డు పొందడం జరిగింది. డిండి పీఎం శ్రీ తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాల మరియు కళాశాల విద్యార్థులు పి.వైశాలి జి. అక్షిత ప్రతిభకు ప్రశంస అందుకున్నారు. కరాటే మార్షల్స్ రంగంలో నల్లగొండ జిల్లా డిండి మండలానికి చెందిన విద్యార్థులు సరికొత్త చరిత్ర సృష్టించారు .ఈ సందర్భంగాడిండి టీజీ ఎంఎస్ ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి ఉపాధ్యాయులు ఈ గిన్నిస్ వరల్డ్ రికార్డు కు ఎంపికైన విద్యార్థులకు ఘనంగా సన్మానిస్తూ వాళ్లను అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆశిస్తున్నామని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్ ప్రధానోపాధ్యాయులు రామారావు మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు కరాటే మాస్టర్ లక్పతిపాల్గొన్నారు.



# తిమ్మాపురం (202) పోలింగ్ కేంద్రంలో ముమ్మరంగా ఎమ్యునరేషన్ ఫారాల ఆన్‌లైన్ నమోదు



**దేవరకొండ జూలై 13 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)-2026 కార్యక్రమంలో భాగంగా, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సూచనల మేరకు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాంకునావత్ బిక్కు నాయక్ నేరేడుగొమ్ము క్లస్టర్ కోఆర్డినేటర్ గిరి యాదయ్య పర్యవేక్షణలో నేరేడుగొమ్ము మండలం తిమ్మాపురం గ్రామం (పోలింగ్ కేంద్రం--202) పరిధిలో ఎమ్యునరేషన్ ఫారాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. బూత్ లెవల్ ఏజెంట్ (బి ఎల్ ఎ) పంబాల పర్వతాలు, నేరేడుగొమ్ము కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇప్ప బస్వారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి, అవసరమైన పత్రాలను పరిశీలిస్తూ అక్కడికక్కడే ఎమ్యునరేషన్ ఫారాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. గత రెండు రోజులుగా మందకొడిగా సాగిన నమోదు ప్రక్రియ నేడు ప్రత్యేక కార్యాచరణతో వేగం పుంజుకుంది. ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి సర్-2026 కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించడంతో పాటు ఓటర్ల సందేహాలను నివృత్తి చేయడం ద్వారా నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా బి ఎల్ ఎ పంబాల పర్వతాలు మాట్లాడుతూ, తిమ్మాపురం పోలింగ్ కేంద్రం పరిధిలో మిగిలిన అతి కొద్ది మంది ఓటర్ల ఎమ్యునరేషన్ ఫారాల నమోదును రేపటిలోగా పూర్తి చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు కావడం ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎంతో ముఖ్యమని అన్నారు. నేరేడుగొమ్ము కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇప్ప బస్వారెడ్డి మాట్లాడుతూ, ఓటు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, భవిష్యత్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ప్రస్తుతం జరుగుతున్న సర్ 2026 ప్రక్రియలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా పాల్గొని ఎమ్యునరేషన్ ఫారాన్ని సమర్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# తోటపల్లి--ఎల్లికట్ట రహదారి పనులు వెంటనే చేపట్టాలి

**- తల్లోజు ఆచారి**

**కల్వకుర్తి, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మండలంలోని తోటపల్లి--ఎల్లికట్ట రహదారి దుస్థితిని నిరసిస్తూ, రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ మండల అధ్యక్షుడు మట్ట నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ, "ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం" అని విమర్శించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే రహదారి పనులు ప్రారంభించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. "లేనిపక్షంలో కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు బోడ నర్సింహ, నాయకులు గుర్రాల రాంభూపాల్ రెడ్డి, కృష్ణ గౌడ్, సురేందర్ గౌడ్, శ్రీశైలం, బాలకృష్ణ, రాజశేఖర్, రమణ గౌడ్, లక్ష్మారెడ్డి, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ శ్రేయస్సు కోసం స్వామివారిని ప్రార్థించిన సర్పంచ్ శ్రీను నాయక్



**ఆమనగల్లు, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రావణ మాసం సందర్భంగా సోమవారం ఉదయం శ్రీ అయ్య సాగర త్రిపురాంతకేశ్వర శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో రాంనుంతల గ్రామ సర్పంచ్ శ్రీను నాయక్ తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. శివునికి అత్యంత ప్రీతికరమైన రుద్రాభిషేకాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని, గ్రామంలో శాంతి, సుభిక్షం, అభివృద్ధి నెలకొనాలని, రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని స్వామివారిని ప్రార్థించినట్లు సర్పంచ్ శ్రీను నాయక్ తెలిపారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్, కుటుంబ సభ్యులు, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది

**- ప్రీ ప్రైమరీ విద్య**



**కల్వకుర్తి, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం కల్వకోలు గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ సోమవారం 30 మంది విద్యార్థులతో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించారు. తరగతి గదులను పరిశీలించిన ఆయన, విద్యార్థుల హాజరు, బోధన ఏర్పాట్లు, బోధనా సామగ్రి వినియోగం వంటి అంశాలను సమీక్షించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. "చిన్నారుల మానసిక స్థాయిని అర్థం చేసుకొని ఆటలు, పాటలు, కథలు, చిత్రాలు, కార్యాచరణ ఆధారిత బోధన ద్వారా అభ్యాసాన్ని ఆసక్తికరంగా మార్చాలి" అని సూచించారు. డీఈఓ మాట్లాడుతూ, "ప్రీ ప్రైమరీ విద్య చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది. భాషా సామర్థ్యం, సృజనాత్మకత, ఆలోచనా విధానం, సామాజిక విలువలు పెంపొందించడంలో ఇది కీలకం" అని అన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. తరువాత ఆయన నార్లాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, వర్షాల కారణంగా దెబ్బతిన్న తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భవనాల మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ తరగతి గదులను ఏర్పాటు చేసి బోధన కొనసాగించాలని సూచించారు. "ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, సురక్షిత వాతావరణం, మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే విద్యాశాఖ లక్ష్యం. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికితీసి ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలి" అని డీఈఓ రమేష్ కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి వెంకటయ్య, పెద్దకొత్తపల్లి మండల విద్యాధికారి ఉమాదేవి, కొల్లాపూర్ ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఓటర్ నమోదు ప్రక్రియను పర్యవేక్షించిన తల్లోజు ఆచారి



**కల్వకుర్తి, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మండలంలోని కురుమిద్ధ, మార్చాల, జీడిపల్లి, తోటపల్లి, వేపూరు, గుండూరు, సుద్ధకల్ గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ నమోదు ప్రక్రియను బీజేపీ నేత, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి సోమవారం బిఎల్‌ఏ ఏజెంట్లు, పార్టీ నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి. బిఎల్‌ఏ ఏజెంట్లు, పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి. ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు నమోదు చేసి, ఓటు హక్కు పరిరక్షణలో చురుకుగా ఉండాలి" అని సూచించారు. ప్రత్యేక ఓటర్ నమోదు ప్రక్రియను విజయవంతం చేయడంలో బీజేపీ శ్రేణులు చురుకుగా పాల్గొని ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు బోడ నరసింహ, జిల్లా కార్యదర్శి రాంభూపాల్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, కృష్ణగౌడ్, సురేందర్ గౌడ్, శ్రీశైలం, రాజశేఖర్, లింగారెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తకు కష్టం వస్తే.. నేనున్నానన్న చల్లా

**ఆమనగల్లు, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇటీవల మిడ్జిల్‌లో జరిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ సందర్భంగా దురదృష్టవశాత్తు మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కుటుంబాన్ని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచందర్ రెడ్డి సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, మనోధైర్యం కోల్పోవద్దని ఓదార్పునిచ్చారు. ఈ సందర్భంగా కార్యకర్త కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే ప్రతి కార్యకర్త పార్టీకి వెన్నెముకలాంటి వారేనని, కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చినా నాయకత్వం వారి వెంటే ఉంటుందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందేలా వ్యక్తిగతంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులను ధైర్యంగా ఉండాలని సూచిస్తూ వారికి అన్ని విధాలా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మాజీ అధ్యక్షులు తెల్గమల్ల జగన్, బీచ్య నాయక్, మార్కెట్ డైరెక్టర్లు అజీమ్, అంజయ్య గుప్తా, సర్పంచ్ రామలక్ష్మణ్, భగవన్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, వెంకటేష్, గణేష్ గౌడ్, శిరీష్, శేఖర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబోద్దీన్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, ఆరిఫ్, దేవరశెట్టి మహేష్, శేఖర్ గౌడ్, రమేష్, బాబా తదితరులు పాల్గొన్నారు.



# ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా రాస మల్ల కృష్ణయ్య




**కల్వకుర్తి, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మండల పార్టీ కార్యాలయంలో బీసీ కమిషనర్ తల్లోజు ఆచారి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా వేపూర్ ఉపసర్పంచ్ రాస మల్ల కృష్ణయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాస మల్ల కృష్ణయ్య మాట్లాడుతూ, "నా మీద నమ్మకంతో ఈ పదవిని అప్పగించడం ఎంతో సంతోషకరం. మండల, జిల్లా, రాష్ట్ర నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు" అని పేర్కొన్నారు.

# సరికొండలో అభివృద్ధి శంఖారావం.. రూ.1.15 కోట్ల పనులకు శ్రీకారం



**ఆమనగల్లు, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మరింత వేగం పెరిగింది. సరికొండ గ్రామంలో రూ.1.15 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.75 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులు, రూ.30 లక్షలతో హెచ్‌ఎండీఏ నిధుల ద్వారా సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన ఐదు హైమాస్ట్ లైట్లను ప్రారంభించి గ్రామ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన అదనపు నిధులను కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సరికొండ--నాగిళ్ల, సరికొండ--ముద్విన్ రహదారుల పనులకు త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, గీత కార్మికులు, వృద్ధులు, వికలాంగుల పెండింగ్ పింఛన్ల ప్రక్రియను కూడా త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. సర్పంచ్ అద్దాల మహేందర్ గౌడ్ మాట్లాడుతూ సరికొండతో పాటు బోయినగుట్ట తండా, పల్లెచల్క తండాల అభివృద్ధికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని కొనియాడారు. గ్రామాల అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రజాప్రతినిధులకు గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీత నరసింహ ముదిరాజ్, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోతుగంటి శంకరన్న, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎలిగేడు మండలంలో నూలిపురుగు నివారణ మాత్రల పంపిణీ



**ఎలిగేడు, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ నూలిపురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎలిగేడు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాల్లో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా ఆధ్వర్యంలో 1--19 ఏళ్ల వయస్సులోని పిల్లలకు మాత్రలు వేసారు. మండలంలో మొత్తం 3192 మంది పిల్లల్లో 3070 మందికి మాత్రలు వేసి 94 శాతం లక్ష్యాన్ని సాధించారు. మాత్రలు వేసుకోని వారికి ఈ నెల 20న పంపిణీ చేయనున్నట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు. ఈ కార్యక్రమలో మండలంలోని సర్పంచులు, హెడ్ మాస్టర్లు, అంగన్వాడి టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కంటి వెలుగులు పంచుతున్న లయన్స్ క్లబ్ సేవలు

**- ఉచిత శిబిరంలో 60 మందికి పరీక్షలు.. 18 మందికి ఉచిత శస్త్రచికిత్సల కోసం ఎంపిక**

**ఆమనగల్లు, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సమాజ సేవే ధ్యేయంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, రాంరెడ్డి లయన్ ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని రాంరెడ్డి విజన్ సెంటర్‌లో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని క్లబ్ కార్యదర్శి గంగుల శ్రీనివాస్ రెడ్డి, మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాముతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, నేత్రదానం ద్వారా మరొకరికి చూపు ప్రసాదించే మహోన్నత సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. శిబిరంలో కంటి వైద్య నిపుణులు డా. ఎం. చంద్రశేఖర్ 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, కంటి శుక్లాల సమస్యతో బాధపడుతున్న 18 మందిని ఉచిత ఐఓఎల్ శస్త్రచికిత్సల కోసం రాంరెడ్డి లయన్ ఐ హాస్పిటల్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ నటరాజ్ బి. యాదయ్య, కౌన్సిలర్ పాపిశెట్టి రాము, కో-ఆప్షన్ సభ్యులు లయన్ చుక్కా అల్లాజీ గౌడ్, కర్నాటి కొండల్ రెడ్డి, క్లబ్ పీఆర్వో ఎం.ఏ. పాషా, శిరీష ఆసుపత్రి సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



# చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం

**– నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసిన కౌన్సిలర్ పాపిశెట్టి రాము**



**ఆమనగల్లు, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆరోగ్యవంతమైన విద్యార్థులే దేశ భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తారని ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం 5వ వార్డు పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేసి వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో నులిపురుగుల సమస్యను నివారించడం ద్వారా వారి ఆరోగ్యం మెరుగుపడి, శారీరక--మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా నులిపురుగుల మాత్రలు తీసుకోవాలని, తల్లిదండ్రులు కూడా పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని పిల్లలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తిరుపతిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి అర్హుడి ఓటు నమోదే లక్ష్యం..

- ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్ పిలుపు



**ఆమనగల్లు, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీ పరిధిలోని 197, 198 పోలింగ్ బూత్‌లలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఆమనగల్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు కీలకమైందని, గ్రామంలోని ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతతో పాటు ఇప్పటివరకు ఓటరు జాబితాలో పేరు నమోదు కానివారు, వివరాల్లో మార్పులు చేయించుకోవాల్సిన వారు ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీఎల్ఓలు, బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ ప్రజలు కూడా కార్యక్రమానికి సహకరించి ఎవరూ ఓటు హక్కును కోల్పోకుండా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి బూత్‌లలో కొనసాగుతున్న నమోదు ప్రక్రియను పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బీఎల్ఏ హరిలాల్ నాయక్, బీఎల్ఓ సరోజతో పాటు స్థానిక నాయకులు కొండల్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బస్సు కోసం ఎదురుచూపులు... చదువుకు బ్రేకులు!

- ప్రత్యేక బస్సులు లేక విద్యార్థుల అవస్థలు
- ప్యాసింజర్ బస్సులు ఆగడం లేదని ఆవేదన.. కొణిదెలలో బస్సు అడ్డుకుని నిరసన
- విద్యార్థుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం: టౌన్ సీఐ అశోక్‌కుమార్





**నందికొట్కూరు, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**విద్య ప్రతి విద్యార్థి హక్కు. ఆ హక్కుకు రవాణా సమస్య అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేకంగా విద్యార్థి బస్సులు నడపాలని, సాధారణ ఆర్టీసీ బస్సులు కూడా విద్యార్థుల కోసం తప్పనిసరిగా నిలపాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే నందికొట్కూరు మండలంలోని కొణిదెల గ్రామంలో పరిస్థితి మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. ప్రత్యేక విద్యార్థి బస్సు లేకపోవడం, ప్యాసింజర్ బస్సులు సైతం విద్యార్థులను ఎక్కించకుండా వెళ్లిపోవడంతో రోజూ పలువురు విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు ఆలస్యంగా చేరుకుంటున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం పడటమే కాకుండా డ్రాప్‌అవుట్‌లు పెరిగే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొణిదెల గ్రామం నుంచి ప్రతిరోజూ సుమారు 50 మందికి పైగా విద్యార్థులు నందికొట్కూరులోని పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలకు వెళ్లి విద్యను అభ్యసిస్తున్నారు. గత కొద్ది రోజులుగా ప్రత్యేక విద్యార్థి బస్సు లేకపోవడంతో పాటు సాధారణ ఆర్టీసీ బస్సులు కూడా ఆగకపోవడంతో విద్యార్థులు గంటల తరబడి రహదారులపై నిరీక్షించాల్సి వస్తోంది. కొంతమంది డ్రైవర్లు, కండక్టర్లు విద్యార్థులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సమస్య తీవ్రతరమవడంతో సోమవారం విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కొణిదెల గ్రామంలో బస్సును అడ్డుకుని నిరసన చేపట్టారు. సమాచారం అందుకున్న నందికొట్కూరు టౌన్ సీఐ అశోక్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించి పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యను ఆర్టీసీ డిపో అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ప్రత్యేక విద్యార్థి బస్సు ఏర్పాటు చేయడంతో పాటు పాఠశాలల సమయాలకు అనుగుణంగా బస్సులు నడిచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య కార్యదర్శి దక్క కుమార్ మాట్లాడుతూ, నందికొట్కూరు నియోజకవర్గంలోని గ్రామాల నుంచి విద్యాభ్యాసం కోసం పట్టణానికి వచ్చే విద్యార్థులకు సరిపడా బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల చదువుకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆర్టీసీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులను ఎక్కించకుండా బస్సులు వెళ్లిపోతే బస్సు నంబర్, రూట్, సమయం, ఫొటోలు లేదా వీడియోలతో పోలీసుల హెల్ప్‌లైన్--112కు లేదా ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేసి విద్యార్థుల రాకపోకలకు ఆటంకం కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు.
విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నందికొట్కూరు డిపో అధికారులు వెంటనే ప్రత్యేక విద్యార్థి బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు ప్యాసింజర్ బస్సులు కూడా తప్పనిసరిగా విద్యార్థుల కోసం నిలిపేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. విద్యార్థులతో డ్రైవర్లు, కండక్టర్లు మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాల్సిన బాధ్యత ఆర్టీసీపైనే ఉందని అభిప్రాయపడుతున్నారు.

# ఓటు హక్కు కోల్పోవద్దు... వెంటనే ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించండి

- ఇంటింటికీ ప్రత్యేక ప్రచారం ప్రారంభించిన మున్సిపల్ యంత్రాంగం
- పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఏఈఆర్వో, మున్సిపల్ కమిషనర్ ఎస్. రాఘవేందర్ రెడ్డి



**ఆమనగల్లు, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్--2026) కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు ఆమనగల్లు మున్సిపాలిటీ యంత్రాంగం విస్తృత చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఏఈఆర్వో, మున్సిపల్ కమిషనర్ ఎస్. రాఘవేందర్ రెడ్డి సోమవారం మున్సిపల్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులు, స్థానిక ఓటర్లతో మాట్లాడి ఫారాల సేకరణలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. అనేక మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి తిరిగి అందజేయడంలో జాప్యం చేస్తున్నట్లు గుర్తించిన కమిషనర్ వెంటనే స్పందించారు. పట్టణవ్యాప్తంగా ఆటోల ద్వారా మైక్ అనౌన్స్‌మెంట్లు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయడంతో పాటు మున్సిపల్ సిబ్బంది, కార్మికులను రంగంలోకి దించి ఇంటింటికీ వెళ్లి ఫారాలను సేకరించే ప్రత్యేక ప్రచారాన్ని ప్రారంభించారు. ఓటర్లందరూ తమ ఎన్యూమరేషన్ ఫారాలను ఎలాంటి ఆలస్యం చేయకుండా సంబంధిత బీఎల్ఓలకు లేదా మున్సిపల్ కార్యా లయంలో వెంటనే సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఫారా లను సమర్పించని పక్షంలో ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అన్ని రాజ కీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు చురుగ్గా పాల్గొని ప్రజల్లో అవ గాహన కల్పించాలని కమిషనర్ ఎస్. రాఘవేందర్ రెడ్డి కోరారు.

# మహాశైవాక్షయోగం సందర్భంగా ఎలిగేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు



**ఎలిగేడు, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**వందేళ్లకోసారి వచ్చే అత్యంత అరుదైన మహాశైవాక్షయోగం పురస్కరించుకుని ఎలిగేడు మండల కేంద్రంలోని శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయం, రాములపల్లి (ర్యాకల్దేవ్‌పల్లి) లోని నాగలింగేశ్వర స్వామి ఆలయంల్లో సోమవారం భక్తులు అభిషేకాలు, రుద్రాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయడం వలన "శివుడి అనుగ్రహం లభించి సకల పాపాలు తొలగి సుఖసంతోషాలు చేకూరుతాయి" అనే విశ్వా సంతో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భవాని రామలింగేశ్వర ఆలయ ప్రధాన అర్చకులు సెగమ దయాకర్ శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# ప్రతి అర్హుడి ఓటు నమోదే లక్ష్యం

**– 186వ బూత్‌లో ప్రత్యేక సవరణను పర్యవేక్షిస్తున్న బీఎల్ఏ ఎం. అలీమ్**



**ఆమనగల్లు, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ 14వ వార్డు ప్రేమ్‌నగర్ కాలనీలోని 186వ పోలింగ్ బూత్ పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం వేగంగా కొనసాగుతోందని బీఎల్ఏ ఎం. అలీమ్ తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు కావడంతో పాటు ఎలాంటి తప్పులు లేకుండా సవరణలు పూర్తి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం బూత్ లెవల్ ఆఫీసర్ స్వరూప, సూపర్వైజర్ ఎం.డి. గౌస్ సమన్వయంతో కొత్త నమోదులు, పేరు మార్పులు, చిరునామా మార్పులు, తొలగింపుల దరఖాస్తులను స్వీకరిస్తూ ఓటర్లకు అవసరమైన సూచనలు అందిస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివరాలను పరిశీలించి అవసరమైన దరఖాస్తులను సమర్పించాలని అలీమ్ కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వస్పుల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# నూలి పురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలి

**– మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్**



**ఆమనగల్లు, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో సోమవారం జాతీయ నూలి పురుగుల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ గీత ఆచారి కలిసి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి వేయించారు. అనంతరం చైర్మన్ పత్య నాయక్ మాట్లాడుతూ ఒక సంవత్సరం నుంచి 18 ఏళ్లలోపు ప్రతి చిన్నారికి ప్రభుత్వ సూచనల మేరకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని, నూలి పురుగుల నివారణతో పిల్లల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు రక్తహీ నత, పోషకాహార లోపం వంటి సమస్యలను నివారించవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు పరిశుభ్రత అలవాట్లు పెంపొందించి ఇటువంటి ఆరోగ్య కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజారోగ్య కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది, మున్సిపాలిటీ సిబ్బంది, హాస్టల్ వార్డెన్ గోపాల్, కౌన్సిలర్ మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అప్రమత్తతతోనే డెంగ్యూ నివారణ

**– తలముడిపిలో అవగాహన కార్యక్రమం**



**నందికొట్కూరు, జూలై 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లా తలముడిపి గ్రామంలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి. మద్దిలేటి మాట్లాడుతూ, "పరిసరాల పరిశుభ్రత, ఇళ్ల చుట్టూ నీటి గుంటలు లేకుండా అప్రమత్తంగా ఉంటేనే డెంగ్యూ నివారణ సాధ్యమవుతుంది" అని పేర్కొన్నారు .జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది డెంగ్యూ నిర్మూలన ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, నిల్వ నీరు లేకుండా చ రాడాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలకు సూచించారు. డెంగ్యూ లక్షణాలు, నిర్ధారణ, చికిత్స, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. "పరిశుభ్రమైన పరిసరాలు, ప్రజల అప్రమత్తతతోనే డెంగ్యూ వ్యాప్తిని అరికట్టవచ్చు" అని వైద్యాధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ ఎం. మహేశ్వర్ రెడ్డి, ఎంపీహెచ్ఎస్ కె. మీనాక్షి, మలేరియా హెల్త్ అసిస్టెంట్ ఎ. రాజు, ఏఎన్ఎం డి. మౌలాభీ, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.